


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 07-05-2023 సంపుటి : 04 సంచిక : 221 పేజీలు : 4 వెల : రూ 3-00


# కర్నాటకలో చివరి దశకు ఎన్నికల ప్రచారం

## ఎపి టెన్త్ పరీక్షా ఫలితాలు విడుదల

72.26 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత

బాలురు 69.27 , బాలికలు 75.38 శాతం ఉత్తీర్ణత

ఫలితాల్లో మళ్లీ బాలికలదే ఫస్ట్ ప్లేస్

87.47 శాతంతో మన్యం జిల్లా ముందంజ

చివరగా నిలిచిన నంద్యాల జిల్లా



విజయవాడ,మే6: ఏపీ పదదో తరగతి ఫలితాలు విడుదల అయ్యాయి. విజయవాడలో మంత్రి బొత్స సత్యనారయణ శనివారం ఉదయం ఫలితాలను వెల్లడించారు. ఈ ఏడాది మొత్తం 72.26 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఫలితాల్లో బాలురు 69.27 శాతం, బాలికలు 75.38 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది కంటే ఈసారి 5 శాతం ఉత్తీర్ణతశాతం పెరిగినట్లుగా మంత్రి వెల్లడించారు.ప్రభుత్వ పాఠశాలల్లో 3.47 శాతం ఉత్తీర్ణత పెరిగింది.ఈఏడాది బాలురు కంటే బాలికలే పై చేయి సాధించి నట్లుగా ఆయన తెలిపారు. బాలురు కంటే బాలికలు 6.11 శాతం ఎక్కువ ఉత్తీర్ణత



సాధించారు. టెన్త్ ఫలితాల్లో 87.47 శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా ఫస్ట్ ప్లేస్‌లో నిలవగా, చివరిస్థానంలో నంద్యాల జిల్లా నిలిచింది. 933 స్కూళ్లలో 100 శాతం ఫలితాలుసాధించారు. 38 స్కూళ్లలో సున్నా ఫలితాలు వచ్చాయి.జూన్ 2నుంచి సప్లమెం టరీ పరీక్షలు ఉంటాయని మంత్రి బొత్స సత్యనారయణ వెల్లడించారు. సప్లమెంటరీ పరీక్షల కోసం ఈ నెల 17 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫెయిలైన విద్యార్థులు క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దని సూచిం చారు. మే 13 వరకు రీకౌంటింగ్, రీ వెరిఫీకేషన్ కు అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 3 వేల 349 కేంద్రాల్లో ఏప్రిల్ 03 నుంచి 18 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించగా. ఏప్రిల్ 19 నుంచి 26 వరకు స్పాట్ వ్యాల్యూయేషన్ పూర్తి చేశారు. మొత్తం టెన్త్ పరీక్షలకు 6 లక్షల 40 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా,వీరిలో 6, 05,052 మంది పరీక్షలకు హాజరయ్యారు.



బెంగుళూరులో ప్రధాని మోడీ మెగా రోడ్‌షో

రోడ్డు షోకు భారీగా తరలివచ్చిన ప్రజలు

పూలు చల్లుతూ..అభివాదం చేస్తూ సాగిన ప్రధాని



బెంగళూరు,మే6 : కర్ణాటకలో ఎన్నికలు సమీపిస్తోన్న నేపథ్యంలో... రాజకీయ పార్టీలు ప్రచారాన్ని వేగవంతం చేశాయి. చివరి దశకు చేరుకున్న ఈ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ స్వయంగా రంగంలోకి దిగారు. ఇప్పటికే అనేక సభల్లో ప్రసంగగించారు. తాజాగా బెంగళూరులో భారీ రోడ్ షో నిర్వహించారు. ప్రధాని రోడ్ షో అత్యంత అట్టహాసంగా ప్రారంభ మైంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ భారీ రోడ్ షో 13 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 26 కిలోమీటర్ల మేర సాగింది. ఇది మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరగనుందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ రోడ్ షో జేపీ నగరంలోని బ్రిగేడ్ మిలీనియం నుంచి బెంగళూరు సెంట్రల్‌లోని మల్లేశ్వరంలోని మారమ్మ సర్కిల్ వరకు చేపట్టారు. ప్రధాని మోడీ చేపట్టిన ఈ భారీ రోడ్ షోకు.. బీజేపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. అశేష జన వాహిని మధ్య ఈ రోడ్ షో సాగుతుండగా.. ప్రధాని మోడీ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్న ప్రజలు, పార్టీ కార్యకర్తలు ప్రధాని మోడీపై పువ్వులు చల్లుతూ మద్దతు పలికారు. ఈ క్రమంలోనే అధికారులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. బెంగళూరులోని దాదాపు 34 రోడ్లను మూసివేసినట్టు తెలుస్తోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బలగాలు మోహరించి, పరిస్థితిని అదుపులో ఉంచేందుకు ఏర్పాట్లు చేశారు. ఇంతకుముందు మే 6న 10 కిలోమీటర్లు, 7న 26 కిలోమీటర్ల మేర రోడ్ షో నిర్వహించాలని భావించారు. కానీ ఆదివారం నీట్ పరీక్ష వల్ల ఉన్నందువల్ల ఇవాళ 26 కిలోమీటర్ల రోడ్ షో నిర్వహిస్తుండగా.. ఆదివారం తిప్పసంద్రలోని కెంపేగౌడ విగ్రహం నుంచి ట్రినిటీ వరకు 10 కిలోమీటర్ల మేర రోడ్ షో నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు ఇది జరగనుంది. మొత్తం రెండు రోజుల పాటు కర్ణాటకలో మోదీ రోడ్ షో జరగనుంది.ఈ సందర్భంగా ఆయన ట్విట్టర్ వేదికగా.. కర్ణాటక అభివృద్ధిని గురించి ప్రస్తావించారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా.. ఇప్పటి వరకు తాము చేసిన పనులను వివరిస్తూ.. తదుపరి ప్రభుత్వం ఏర్పాటైతే ఏం చేస్తామనేది వివరిస్తూ మోడీ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇక కర్ణాటక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇప్పటికే బీజేపీతో సహా పలు పార్టీలు రోడ్ షోలు, ర్యాలీలు చేస్తున్నాయి.

## రైతులను మోసం చేసిన ప్రభుత్వం

విపత్తులపై ముందస్తు హెచ్చరికేదీ

మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు సోము వీర్రాజు

కాకినాడ,మే6 : రైతులను ప్రభుత్వం అన్ని విధాలా మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు విమర్శలు గుప్పించారు. విపత్తు వస్తుందని తెలిసి ముందస్తుగా అప్రమత్తం చేయలేక పోయిందన్నారు. తడిసిన ధాన్యం కొంటారన్న భరోసా కూడా లేకుండా పోయిందన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో జరుగుతున్న అవినీతిపై చార్జిషీట్ రూపొందిస్తామని.. దాన్ని జిల్లా ఎస్పీకే అందజేయనున్నట్లు చెప్పారు. నాలుగు రకాలుగా ఆందోళనలు చేయనున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇస్తామన్నారు.



జగన్మోహన్ రెడ్డికి ఏ సహాయం చేసినా ఆంధ్ర రాష్ట్ర ప్రజల కోసం చేస్తున్నామని చెప్పారు. రైతులకు ఈ ప్రభుత్వం సంచులు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని.. ఇందులో అవినీతి జరుగుతోందని ఆరోపించారు. సివిల్ సప్లై అధికారిని ఎందుకు ఎన్నో సంవత్సారాలుగా జిల్లాలో ఇలాగే ఉంచారని ప్రశ్నించారు. రైతు సమస్యలపై అఖిలపక్ష సమావేశం పెట్టాలని బీజేపీ డిమాండ్ చేస్తుందని సోమువీర్రాజు తెలిపారు.

## 'రాజకీయ రాబంధులా చంద్రబాబు వాలిపోయాడు'

కాకినాడ జిల్లా: టీడీపీని డ్రామా కంపెనీలా చంద్రబాబు నడుపుతున్నారని మాజీ మంత్రి కురసాల కన్నబాబు మండిపడ్డారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, చంద్రబాబు దిగజారుడు భాష వాడుతున్నారు.సీఎం జగన్‌పై పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రం కరువుతో అల్లాడిపోయిందని కన్నబాబు అన్నారు."అకాల వర్షాలకు పంటలు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈలోపే రాజకీయ రాబంధులా చంద్రబాబు వాలిపోయాడు. రైతు బాంధువుడిలా ఫోజులు కొడుతూ సిఎం జగన్‌కు శాపనార్థాలు పెట్టుకుని తిరుగుతున్నాడు. చంద్రబాబు దరిద్రం వల్లే రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయింది. చంద్రబాబు పూర్తి ఒత్తిడిలో ఉన్నాడు. జగన్ సీఎం అయ్యాక రైతులు సంతోషంగా ఉన్నారు. పరామర్శల పేరుతో చంద్రబాబు రాజకీయం చేస్తున్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు రైతులను విస్మరించారు" కన్నబాబు దుయ్యబట్టారు.



## తుఫాన్ హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన

ఇప్పటికే తడిసిన ధాన్యంతో దిగాలు

మళ్లీ వర్షం పడితే కోలుకోలేమన్న బెంగ

ధాన్యం సకాలంలో కొనుగోళ్లు చేపట్టాలని వినతి

ఏలూరు,మే6(ఆర్ఎన్ఎ): ఇటీవలి అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతులను ఆదుకుంటామని ప్రకటించడమే తప్ప ఆదుకున్న దాఖలాలు లేవు. విపక్షనేత చంద్రబాబు పలు ప్రాంతాల్లో పర్యటించారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కూడా పర్యటించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అయితే నేతల భరోసాలే తప్ప కార్యాచరణ కానరావడం లేదు. రవాణాకు లారీలు రావడం లేదని, సంచులు ఇవ్వడం లేదని రైతులు మొత్తుకుంటున్నా ఏ ఒక్కరికీ పట్టడం లేదు. ఈ నెల తొమ్మిదో తేదీకి అల్పపీడనం తుపానుగా మారనున్నట్లు చేస్తున్న హెచ్చరికలు రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. గతనెల 16వ తేదీన ధాన్యం కొనుగోలు ప్రారంభించారు. 20 రోజులు దాటుతున్నప్పటికీ సమస్యలు పరిష్కారంకాలేదు. మిల్లర్లు పెడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. ముక్క పేరుతో పెద్దఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారు. ఖరీఫ్‌లో తేమపేరుతో రైతుల నుంచి దోచేసిన మిల్లర్లు, రబీలో ముక్క పేరుతో దోపిడీ చేస్తున్నారు. మిల్లర్లను ప్రభుత్వం అదుపుచేయలేని పరిస్థితి నెలకొంది. ఈనెల మొదటి వారం గడిచిపోతున్నా ఇంకా కల్లాల్లోనే ధాన్యం ఉండిపోవడంతో, వర్షాలతో పంట గట్టెక్కేదెలా అంటూ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇకపోతే ధాన్యం ఆరబెట్టకపోతే మొలకలు.. ఆరబెడితే వర్షం అన్నచందంగా మారింది. వారంరోజులుగా వర్షం రైతులను వెంటాడుతోంది. ప్రతీరోజు ఏదో ఒక సమయంలో వర్షం పడుతూనే ఉంది. దీంతో రైతుల పరిస్థితి దారుణంగా మారింది. వర్షాలకు తడిసిన ధాన్యం అరబెట్టక పోతే మొలకలు వస్తున్నాయి. ఆరబెడితే వర్షానికి మళ్లీ తడిసిపోతుంది. ఆరబెట్టిన తర్వాత వర్షం వస్తే ధాన్యం మళ్లీ రాశులుగా చేయడం చాలా కష్టం. దీంతో రైతులకు ఏంచేయాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. అనేక గ్రామాల్లో ఇప్పటికే తడిసిన ధాన్యం మొలకలు రావడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో వరిసాగుచేసిన వేలాది మంది రైతులది ఇదే పరిస్థితి. మాసూలు చేసిన కల్లాలో ఉన్న ధాన్యం అమ్ముకునేందుకు సంచుల్లేక, లారీలు లేక నానా అవస్థలు పడుతున్నారు. 20 రోజులు గడస్తున్నా ఇప్పటికీ సంచులు ఇవ్వని పరిస్థితి కొనసాగుతోంది. ధాన్యం కొనుగోలులో నూతన విధానం అస్తవ్యస్తంగా తయారైంది. సంచులు, లారీల విషయంలో అధికారులు పూర్తిగా చేతులెత్తేశార. దీంతో రైతులు గందరగోళానికి గురవుతున్నారు. బంగాళాఖాతంలో పొంచి ఉన్న తుపాను హెచ్చరికలతో రైతులు మరింత ఆందోళనకు గురవుతున్నారు.ఏలూరు జిల్లాలో 79వేల ఎకరాలు, పశ్చిమలో 2.13లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగుచేశారు. ఏలూరు జిల్లాలో 3.90 లక్షల మెట్రిక్ టన్నులు, పశ్చిమలో 9.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు.

## చంద్రబాబు నోరు తెలిస్తే అబద్ధాలే: మంత్రి కాకాణి

నెల్లూరు జిల్లా: చంద్రబాబు నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలేనని.. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడు తూ, చంద్రబాబు రైతులతో అబద్ధాలు చెప్పించే ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు.చంద్రబాబుకు జ్ఞాపకశక్తి తగ్గిపోయిందని ఎద్దేవా చేశారు. ప్రతి రైతులకు బీమా ద్వారా రక్షణ కల్పిస్తున్నా మని మంత్రి అన్నారు."రైతులకు 100 శాతం బీమా ప్రీమియం చెల్లిస్తున్న ఏకైక ప్రభుత్వం మాదే. చంద్రబాబు హయాంలో పంటల బీమా సొమ్మును దారి మళ్లించారు. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత బీమా సొమ్ము రైతులకు అందించాం. అకాల వర్షాలతో నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం" అని మంత్రి గోవర్ధన్‌రెడ్డి అన్నారు.



## ఆర్-5 జోన్‌పై సుప్రీంలో అమరావతి రైతుల పిటిషన్

ప్రభుత్వ జీవోపై స్టే విధించాలని వినతి

న్యూఢిల్లీ,మే6: ఆర్- 5 జోన్‌పై అమరావతి రైతులు వేసిన పిటిషన్‌ను ఏపీ హైకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో రైతులు మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆర్-5 జోన్‌లో వేరే ప్రాంతాల వారికి ఇళ్ల స్థలాల కేటాయింపుపై ఏపీ హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించాలని, రాష్ట్ర ప్రభుత్వ జీవోలను రద్దు చేయాలని కోరుతూ రైతులు సుప్రీంను ఆశ్రయించారు. అమరావతి మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవోలు తీసుకొచ్చిందని రైతులు వాపోయారు. రైతులు దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్లను ఏపీ హైకోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే. కోర్టు తుది ఉత్తర్వులకు లోబడి వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేసింది. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు విముఖత చూపుతూ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. దీంతో రైతులు హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టులో ఎస్ఎల్పీ దాఖలు చేశారు. గతంలో హైకోర్టు ఉత్తర్వులు ఇవ్వలేదని తగిన ఉత్తర్వులు ఇవ్వాలని సర్వోన్నత న్యాయస్థానంలో దాఖలు చేసిన పిటిషన్‌ను రైతులు వెనక్కి తీసుకున్న విషయం తెలిసిందే. హైకోర్టు ఇచ్చే ఉత్తర్వుల ఆధారంగా మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివైస్ నేతృత్వంలోని ధర్మాసనం అవకాశం కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ అమరావతి రైతులు పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఉదయం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ధర్మాసన ముందు అమరావతి రైతుల తరపు న్యాయవాదులు ఈ విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించనున్నారు.

## '38 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఏకైక ప్రభుత్వం ఇది'

తాడేపల్లి: 38 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఏకైక ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ స్పష్టం చేశారు.గుంటూరు, విజయవాడలోని కొన్ని ప్రాంతాల ప్రజలకు అమరావతిలో ఇళ్ల స్థలాలు ఇచ్చామన్న సంగతి మాణిక్య వరప్రసాద్ మరోసారి తెలిపారు.శనివారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ..'పేదలకు అమరావతిలో ఇల్లు కట్టడాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లారు. పేదల పక్షాన పోరాడుతున్నానని జగన్ చెప్పున్నారు.అమరావతిలో కేవలం ఒక వర్గం మాత్రమే ఉండాలని మీ ఉద్దేశమా?, సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ను సీఎం జగన్ ప్రభుత్వం శిరసావహిస్తోంది.ప్రతీ పేదవాడికి ఇంటి స్థలం ఉండాలనేది సీఎం జగన్ ఉద్దేశం. పేదలకోసం పోరాడతామనే వామపక్షాలు, ప్రజాసంఘాలు ఈ జడ్జిమెంట్‌పై కిమ్మనలేదు. రాజ్యాంగం ప్రకారం ప్రతీ వ్యక్తికి సమానత్వం ఉండాలి. పేదలకు మంచి జరుగుతున్నప్పుడు అడ్డుకునే సంస్కృతిని టీడీపీ మానుకోవాలి' అని పేర్కొన్నారు.



# సంపాదకీయం

ఆదివారం 07-05-2023

## విదేశాల బాట పడుతున్న సంపన్నులు

భారతదేశ పౌరసత్వాన్ని వదులుకుంటున్న వారి సంఖ్య బాగా పెరిగింది. మెరుగైన జీవన ప్రమాణాల కోసం సంపన్నులు కుటుంబ సమేతంగా విదేశాలకు తరలిపోతున్నారు. ఇతర దేశాల్లో పౌరసత్వం కోసం పెద్దమొత్తంలో ఖర్చు చేయడానికి కూడా వెనకాడటం లేదు. కోట్లకొద్ది ఆస్తులున్న కుబేరులు దేశం విడిచి వెళ్లడం ఆశ్చర్యంగా ఉంది. అమెరికాలో ఈబీ-5 ఇన్వెస్ట్ మెంట్ వీసా ద్వారా గ్రీన్ కార్డు పొంది పౌరసత్వం పొందుతున్నారు. దీనికి 8 లక్షల డాలర్లు ఖర్చవుతుంది.ఇలా వచ్చిన వారు 10 మంది స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. పోర్చుగీసు, దుబాయి తదితర దేశాల్లో అయితే గోల్డెన్ వీసా పేరుతో శాశ్వత నివాసం పొందుతున్నారు. దీనికి కూడా భారీగా ఖర్చవుతుంది. ఒక్కో దేశంలో ఒక్కో రకమైన నిబంధనలు ఉన్నాయి. వాటికనుగుణంగా అమెరికా, ఆస్ట్రేలియా, పోర్చుగీస్, కెనడా, బ్రిటన్, గ్రీస్, దుబాయ్, జర్మనీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తదితర దేశాలకు ఎక్కువమంది వెళు న్నారు.గడచిన దశాబ్ద కాలంలో భారతదేశ పౌరసత్వాన్ని 16,21,561 మంది వదులుకున్నారు. 2011లో 1,22,819 మంది, 2012లో 1,20,923, 2013లో 1,31,405, 2014లో 1,29,328, 2015లో 1,31,489, 2016లో 1,41,603 మంది, 2017లో 1,33,049, 2018లో 1,34,561, 2019లో 1,44,017 మంది భారత పౌరసత్వాన్ని వదులుకోగా.. కోవిడ్ ప్రభావం ఎక్కువగా ఉన్న 2020లో 85,256 మంది మాత్రమే భారత్‌ను వీడి వెళ్లారు. 2021లో 1,63,370 మంది, 2022 అక్టోబర్ 31 వరకు ఏకంగా 1,83,741 మంది భారత పౌరసత్వాన్ని వదులుకున్నారు. ఈ విషయాన్ని సాక్షాత్తూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఇటీవల లోక్‌సభలో వెల్లడించారు.పొట్టచేతబట్టుకుని బతుకుదెరువు కోసం విదేశాలకు తరలివెళ్లడం సహజంగా జరిగేదే. కానీ తాజాగా బాగా సంపాదించిన ధనవంతులు, చదువుకున్న మేధావులు విదేశాలకు తరలిపోతున్నారు. మన దేశంలో మానవ నాగరికతా వికాసంలో విజ్ఞానం, సాంకేతికత, సౌకర్యాలు బాగా పెరిగాయి. అయితే వీటితో పాటు కాలుష్యం కూడా పెరిగింది. అభివృద్ధి, సాంకేతికత పేరుతో విశృంఖలంగా వెర్రితలలేసిన అసాంఘిక పోకడలతో ప్రకృతిని ధ్వంసం చేస్తున్నాం. నదులు, నీటిని, భూమిని కలుషితం చేశాం. అనేక రాష్ట్రాల్లో వేర్పాటువాదం, నక్సలిజం, తీవ్రవాద ప్రభావం ఎక్కువగా ఉంది. దీంతో నిత్యం అభద్రత, కాలుష్యంతో బతకలేక సంపన్నులు పాశ్చాత్య దేశాల వైపు చూస్తున్నారు.పొరుగుదేశాలకు వెళ్లేందుకు క్యూ కడుతూ అక్కడ పౌరసత్వం కోసం పడిగాపులు కాస్తున్నారు. దీని కారణంగా వేలకొద్ది దరఖాస్తులు ఆయా దేశాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్క అమెరికాలోనే శాశ్వత నివాసం కోసం 4,16,000 అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఏడాది 78 వేల మంది అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్ తదితర దేశాల్లో భారతీయులు పౌరసత్వం తీసుకున్నారు.అత్యంత సంపన్నులు ఉన్న దేశాల్లో మన దేశం నాలుగో స్థానంలో ఉంది. అమెరికా, చైనా, జపాన్ తర్వాత భారత్ ఉంది. విదేశాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న వారి నుంచి మన దేశానికి విదేశీ మారక ద్రవ్యం భారీగా వస్తున్నప్పటికీ శ్రీమంతులు దేశం వదిలి వెళ్లడం వల్ల ఇక్కడి సంపద కొంత తరలిపోతోంది. దీని ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై ఎంతో కొంత ఉంటుంది.గత మూడేళ్లలో భారత పౌరసత్వాన్ని వదులుకున్న వారిలో ఎక్కువ మంది అమెరికా పౌరసత్వాన్ని పొందారు. 2019లో అమెరికాలో 61 వేల మంది, 2020లో 30,828 మంది.. 2021లో 78,284 మంది పౌరసత్వాన్ని పొందారు. గత ఏడాది భారత పౌరసత్వాన్ని వదులుకున్న వారిలో సుమారు 48 శాతం మంది అమెరికా పౌరసత్వాన్ని పొందారు. ఆ తర్వాత స్థానంలో ఆస్ట్రేలియా ఉంది. 2021 ఏడాది 23,533 మంది భారతీయులు ఆస్ట్రేలియా పౌరసత్వం పొందారు. 2019లో 21,340 మంది, 2020లో 13,158 చొప్పున ఆస్ట్రేలియా పౌరసత్వాన్ని పొందారు. కెనడా పౌరసత్వం కోసం కూడా భారతీయులు ఎక్కువగానే ఆసక్తి చూపుతున్నారు.2019, 2020, 2021లో వరుసగా 25,381 మంది, 17,093 మంది, 21,597 మంది చొప్పున భారతీయులు కెనడా సిటిజన్‌షిప్ పొందారు. తర్వాత బ్రిటన్ పౌరసత్వాన్ని పొందిన వారిలో 2021లో 14,637 మంది, 2020లో 6,489 మంది ఉన్నారు. ఇటలీ పౌరసత్వాన్ని 2021లో 5,986 మంది, 2020లో 2,312 మంది ఉన్నారు. న్యూజిలాండ్ పౌరసత్వం విషయంలో 2021లో 2,643 మంది, 2020లో 2,116 మంది ఉన్నారు. సింగపూర్ పౌరసత్వాన్ని పొందిన వారిలో 2021లో 2,516 మంది, 2020లో 2,289 మంది ఉన్నారు. ఇక జర్మనీ, నెదర్లాండ్స్, స్వీడన్, పోర్చుగల్, దుబాయ్, అరబ్ ఎమిరేట్స్, గ్రీస్ తదితర దేశాలకు కూడా భారీగానే తరలివెళ్లారు..వీరితో పాటు ఉన్నత చదువులు, ఉద్యోగ, ఉపాధి కోసం వచ్చి ఆయా దేశాల్లో స్థిరనివాసం ఏర్పరచుకుని పౌరసత్వం పొందుతున్న వారి సంఖ్య కూడా బాగా పెరిగింది. ఇలా వచ్చిన వారు గ్రీన్ కార్డ్ పొంది, పౌరసత్వం పొందడానికి రెండు దశాబ్దాలకు పైగా పడుతుంది. ఈ అవకాశాన్ని సంపన్నులు తమకున్న ఆర్థిక వనరులతో త్వరగా పొందుతున్నారు. ముఖ్యంగా అధిక జనాభా ఉన్న చైనా, భారత్ నుంచి ఈ వలసలు చాలా ఎక్కువగా ఉన్నాయి. పౌరసత్వం వదులుకుంటున్న దేశాల్లో చైనా ముందువరుసలో ఉంది. ద్వితీయ స్థానంలో భారత్ ఉంది. ముంబై, కలకత్తా, ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాల నుంచి సంపన్నులు పెద్దఎత్తున విదేశాలకు తరలిపోతున్నారు.ప్రపంచంలోని 199 దేశాలకు సంబంధించిన గ్లోబల్ పాస్ పోర్టు ఇండెక్స్ ర్యాంకింగ్‌లో భారతదేశం 85వ స్థానంలో ఉంది. మనదేశ పాస్ పోర్టుపై 59 దేశాలకు వీసా లేకుండా ప్రయాణం చేయవచ్చు. అత్యంత శక్తివంతమైన పాస్ పోర్టుల జాబితాలో జపాన్, సింగపూర్, అమెరికా తదితర దేశాలు ముందువరసలో ఉన్నాయి. ద్వంద్వ పౌరసత్వ విధానాన్ని భారతదేశం అనుమతించదు. వేరే దేశాల పౌరసత్వం కలిగి ఉన్నప్పుడు మన దేశ పాస్‌పోర్ట్‌ను సరెండర్ చేయాలి. భారత పౌరసత్వం కోల్పోయినప్పుడు ఎన్నికల్లో పోటీచేసే అవకాశం ఉండదు. వ్యవసాయ భూములు కొనుగోలు చేయకూడదు. ప్రభుత్వ ఉద్యోగాలు చేసే అవకాశం కూడా ఉండదు. భారతీయులు తిరిగి స్వదేశానికి రావాలంటే ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా కార్డు ద్వారా, లేదా వీసా ద్వారా మాత్రమే రావాలి. వృద్ధాప్యంలో ఆనందంగా, విలాసవంతంగా బతకాలని కోరుకుంటున్నారు. వివిధ దేశాల్లో లభిస్తున్న సౌకర్యాలు, అక్కడి ప్రజల్లో ఉన్న క్రమశిక్షణ, పరిశుభ్రత, ప్రకృతి వనరులను కాపాడుకోవడంలో ఉన్న శ్రద్ధ, సమయపాలన లాంటి కారణాలతో ఆకర్షితులవుతున్నారు.

## గుంటూరు వైసీపీలో సద్దుమణిగిన వివాదం

గుంటూరు, మే 6, గుంటూరులో మేయర్ వర్సెస్ ఎమ్మెల్యేగా అన్నట్లుగా సాగుతున్న రాజకీయాలకు హైకమాండ్ తెరదించిది. ఇద్దరు నేతలు తమ మధ్య ఎలాంటి గొడవలు లేవని మీడియా ముందు చెప్పాలని ఆదేశించడంతో అదే పని చేశారు. రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక టీడీపీ నాయకులు మా పై అభాండాలు వేస్తున్నారని.. మా మధ్య గొడవలు లేవన్నారు. మాకు పార్టీ ముఖ్యం...వ్యక్తిగత ప్రయోజనాలు కోసం పార్టీని వాడుకోం ...పార్టీ సింబల్ ఫ్యాన్ రెక్కల క్రిందే మేము ఉంటాం అంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ మనోహర్ నాయుడు గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ మనోహర్ కు , గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముస్థఫాకు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. మేయర్ తమకు సరైన ప్రాధాన్యతనివ్వటం లేదని పదమూడు మంది కార్పొరేటర్లు మునిసిపల్ ట్రావెలర్ బంగ్లాలో సమావేశమయ్యారు. గత కొంతకాలంగా సొంత పార్టీకి చెందిన కార్పొరేటర్లే అసంత్రప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో మేయర్ పదవిని కాపు సామాజిక వర్గానికి చెందిన కావటి మనోహర్ నాయుడికి ఇవ్వాలని ప్రతిపాదన వచ్చింది. అయితే గుంటూరు తూర్పు పరిధిలోకి వచ్చే కార్పోరేటర్ రమేష్ గాంధీకి పదవి ఇవ్వాలని ఎమ్మెల్యే ముస్తఫా పట్టుపట్టారు. కానీ మనోహర్ నాయుడికే పదవి దక్కింది. అప్పటి నుండి ఇరువురికీ పొసగడం లేదు. మేయర్ పదవి నుంచి మనోహర్ నాయుడును తొలగించేందుకు ఎంఎల్ఏ ముస్తఫా ప్రయత్నం చేస్తున్నాడరని అని కావటి వర్గం భావిస్తోంది. ఎంఎల్ఏ ప్రమేయం లేకుండా సొంత నిర్ణయాలతో పనులు కొనసాగిస్తూ ముస్తఫాను పక్కన పెట్టే ప్రయత్నం చేస్తున్నాడని ఎంఎల్ఏ వర్గం అనుమానిస్తోంది. ఈ క్రమం? కార్పొరేటర్లు సమావేశం పెట్టుకోవడం వైసీపీలో సంచలనం రేపింది. సొంత పార్టీలో కార్పోరేటర్ల కుమ్ములాట..మేయర్ వర్సెస్ ఎంఎల్ఏ అంటూ సోషల్ మీడియాలో కథనాలు హోరెత్తించాయి. ఈ వార్తలపై ఎవ్వరూ స్పందించక పోవడంతో కథనాలకు మరింత బలం చేకూరింది. పార్టీ పరువు బజారున పడటంతో నష్ట నివారణ చర్యలను హైకమాండ్ చేపట్టింది. మేయర్ కావటి మనోహర్ నాయుడిని, ఎంఎల్ఏ ముస్తఫాను గుంటూరు రీజనల్ కార్యలయానికి పిలిపించారు


ఎంపీ ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి. నాలుగు గంటల పాటు ఇద్దరితో మాట్లాడారు. వారు చెప్పిన విషయాలు ?పికతో విన్న అయోధ్య రామిరెడ్డి పార్టీ పరువు బజారులో పెట్టే పరిస్థితి వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఒక పక్కన ప్రతిపక్ష పార్టీల పొత్తులు, ఎత్తులు, జిత్తులతో తలమునకలై ఉన్నామని అలాంటి సందర్భంలో సొంత పార్టీలో ఈ గొడవలేమిటని ప్రశ్నించారు. ఎంపీ క్లాస్ పీకడంతో జరుగుతున్న వివాదలకు ముగింపు పలికేందుకు మేయర్, ఎంఎల్ఏ సిద్ధమయ్యారు...గుంటూరు గాంధీ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణ పనుల పరిశీలన వేదికగా చేసు కున్నారు..పార్కులోపనులను కావటి, ముస్తఫా కార్పోరేటర్లతో కలసి పరిశీలించారు. తర్వాత మధ్య విబేధాలేమీ లేవని ప్రకటించారు.

## బాలినేని వైసీపీకి దూరమవుతున్నారా ?



ఒంగోలు, మే 6, అనుకున్నంతా అయింది, మాజీ మంత్రి బాలినేని ఎపిసోడ్ కి ఎండ్ కార్డ్ పడే సమయం దగ్గరకు వచ్చింది. వైసీపీలో ఇక బాలినేని ఇమడలేరు అనే విషయం నిర్ధారణ అయింది. జగన్ తో తనకేమాత్రం ఇబ్బంది లేదు అంటూనే బాలినేని సొంత పార్టీ నేతలకు చీవాట్లు పెట్టారు. వైసీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తమ పార్టీలో కొందరిపై పరోక్ష విమర్శలు చేశారు. ఓ దశలో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తనపై నిందలు ఆరోపణలు భరించలేకపోతున్నానని కంటతడి పెట్టారు. కావాలనే తనపై తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని వాపోయారు. గొనె ప్రకాశ్‌రావుకి వైవీ సుబ్బారెడ్డి దేవుడిగా కనిపిస్తే అభ్యంతరం లేదు..కాని తన గురించి మాట్లాడాల్సిన అవసరం ఏంటని బాలినేని ప్రశ్నించారు. తాను తప్పు చేసినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని తెలిపారు.తాను పార్టీ మారుతున్నట్లు ప్రచారాలు కూడా చేస్తున్నారని.. ఇవన్ని ఎవరు చేస్తున్నారో అందరికీ తెలుసని విమర్శించారు. ఒంగోలులో ఎలాంటి గ్రూపులు లేవన్నారు. కానీ ఇతర నియోజక వర్గాల్లో ఇలాంటి వాటిని చూడలేకపోతున్నానని తెలిపారు.కొంతమందికి సిగ్గులేదంటూ మాట్లాడారు. వారి పేర్లు బయటపెట్టడానికి తనకు సిగ్గుందని, తాను అలాంటి పనులు చేయబోనని, పార్టీని ఇబ్బంది పెట్టబోనని అన్నారు. బాలినేని టార్గెట్ వైవీ సుబ్బారెడ్డి అనే విషయం ఆయన నోటివెంటే బయటపడింది. తెలంగాణకు చెందిన గోనె ప్రకాష్ రావు, తన గురించి చేసిన వ్యాఖ్యలపై సీరియస్ గా రియాక్ట్ అయ్యారు బాలినేని. ఓ వైపు వైవీ సుబ్బారెడ్డిని దేవుడని, ఆయన భార్య దేవత అని గోనె ప్రకాష్ రావు పొగుడుతున్నారని, అదే నోటితో ఆయన జగన్ ని తిడుతున్నారని, ఇదెక్కడి లాజిక్ అన్నారు. పరోక్షంగా వైవీ సుబ్బారెడ్డి, వైసీపీకి నష్టం చేకూరుస్తున్నారని మాట్లాడారు. తాను పార్టీ మారబోతున్నట్టు వస్తున్న వార్తలపై కూడా బాలినేని స్పందించారు. తాను ఎవరిపైనా అధిష్టానానికి ఫిర్యాదు చేయలేదని, చేయబోనని, అది తన నైజం కాదన్నారు బాలినేని. కానీ తనపై చాలామంది అధిష్టానానికి ఫిర్యాదు చేస్తున్నారని, పార్టీ మారుతున్నానంటూ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. సొంత పార్టీ నేతలే తనపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని చెప్పారు. ప్రెస్ మీట్లో బాలినేని ఓ విషయంపై క్లారిటీ ఇచ్చారు. సహజంగా పార్టీ మారే ముందు ఎవరైనా కార్యకర్తల అభీష్టం మేరకే అంటారు. బాలినేని కూడా ఇప్పుడు కార్యకర్తలు, అనుచరుల పేర్లు తెరపైకి తెచ్చారు. తనని నమ్ముకుని ఉన్న కార్యకర్తలకోసం తాను ఎందాకైనా పోరాటం చేస్తానన్నారు. వారి కోసం తాను రాజకీయంగా నష్టపోయినా పరవాలేదన్నారు. రేపు పార్టీ మారినా కార్యకర్తలు, అనుచరులకోసమే అని చెప్పేందుకు ఆయన రూట్ క్లియర్ చేసుకున్నారని అర్థమవుతోంది. ఓ దశలో బాలినేని భావోద్వేగాన్ని దాచుకోలేకపోయారు. ఆయన కళ్లు చెమర్చాయి. గంభీరంగా ఉండే బాలినేని ప్రెస్ మీట్లో ఇలా బేలగా మారిపోవడం అక్కడున్నవారందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. నియోజకవర్గంలో గడప గడపకు తిరిగే అవకాశం లేకపోవడం వల్లే తాను ఇన్ చార్జ్ పదవికి రాజీనామా చేశానని చెప్పిన బాలినేని, ప్రెస్ మీట్లో జగన్ గురించి పెద్దగా మాట్లాడలేదు. తనకు వైఎస్ఆర్ అన్నీ అన్నట్టుగా మాట్లాడారు. దాదాపుగా వైసీపీలో బాలినేని ఎపిసోడ్ ముగిసిపోయిందనే చెప్పాలి. వైసీపీ బాలినేనిని దూరం పెట్టింది అని చెప్పడానికి ప్రెస్ మీట్ ఓ ఉదాహరణ. ఈ ప్రెస్ మీట్ ని సాక్షి కవర్ చేయలేదు. సహజంగా బాలినేని ప్రెస్ మీట్ అంటే అధికార పార్టీకి చెందిన ఛానెల్ లైవ్ కి రెడీగా ఉంటుంది. కానీ సాక్షి చప్పుడు చేయలేదు. అంటే పరోక్షంగా అందరికీ బాలినేని విషయంలో ఓ హింటిచ్చేసింది అధిష్టానం. ఇక అధికారిక నిర్ణయమే తరువాయి. బాలినేని ప్రెస్ మీట్ పై వైసీపీనుంచి ఎలాంటి రియాక్షన్ ఉంటుందో చూడాలి.

## ముద్రగడకు లైన్ క్లియర్... అయినట్టేనా



కాకినాడ, మే 6, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంపై ఇన్నాళ్ళు తుని రైలు దగ్ధం కేసు ఉంది. 2016లో తుని దగ్గర రైలు తగలబెట్టిన కేసులో ఆయన పేరు కూడా ఉంది. ఆ కేసును ఇటీవల కోర్ట్ కొట్టేయడంతో తిరిగి పొలిటికల్‌గా యాక్టివ్ అవ్వాలనుకుంటున్నారు ఆయన. ముద్రగడ చివరిసారిగా 2009 ఎన్నికల్లో పిఠాపురం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.అంతకు ముందు సొంత నియోజకవర్గం ప్రత్తిపాడు నుంచి ఎమ్మెల్యేగా గెలిచినా? 2004లో అక్కడ ఓటమితో ఇక జీవితంలో ప్రత్తిపాడు నుంచి పోటీ చేయబోనని బీష్మించుకు కూర్చున్నారు. ఆ తర్వాత వైసీపీలో చేరతారని ప్రచారం జరిగినా ఏ పార్టీ వైపు చూడలేదు ఆయన. గత సార్వత్రిక ఎన్నికల తర్వాత వైసీపీ నుంచి ఓపెన్ ఆఫర్లు వచ్చినా కేసు కొట్టేసిన తర్వాతేనని చెబుతూ వచ్చారట. ఇప్పుడు ఆ మేటర్ క్లియరైనందున తిరిగి యాక్టివ్ అవడానికి అంతా సిద్ధం చేసుకుంటున్నారట. మనసులో మాట చెప్పకపోయినా? టిడిపి, జనసేనల్లోకి వెళ్లే పరిస్థితి లేదు. బీజేపీ, కాంగ్రెస్ ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న స్థితిలో అటువైపు చూసే అవకాశం లేదు. అంతిమంగా ఆయన ఫ్యాన్ కింద సేదదీరడానికే సిద్ధమవుతున్నారట.వైసీపీలో తనతో పాటు చిన్న కుమారుడు గిరిబాబు కూడా సీటు ఇవ్వాలని గతంలో డిమాండ్ పెట్టారు ముద్రగడ పద్మనాభం.. అయితే మారిన రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఇప్పుడు కొడుకుని మాత్రం ఎన్నికల్లో పోటీ చేయిస్తే చాలని అనుకుంటున్నారు ఆయన. ప్రత్తిపాడులో తాను పోటీ చేయనని ఇప్పటికే చెప్పాను కాబట్టి కుటుంబ సభ్యులను కూడా అక్కడకు పంపకూడదని అనుకుంటున్నారట.. 2009లో ట్రయాంగిల్ ఫైట్ కారణంగా పిఠాపురంలో స్వల్ప తేడాతో ఓడిపోయారు ముద్రగడ. అందుకే.. గిరిబాబును అక్కడి నుంచే బరిలో దింపే ఆలోచన ఉందట. కానీ?పార్టీలోకి రమ్మని ఆహ్వానించే వరకు ఒకేగానీ? సీటు విషయంలో స్పష్టమైన హామీ ఇచ్చే ఉద్దేశ్యంలో లేదట వైసీపీ. పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీలో ఉంటారని జోరుగా ప్రచారం జరుగుతోంది.రాష్ట్రం మొత్తం మీద కాపు సామాజికవర్గం ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో పిఠాపురం ఒకటి? ప్రస్తుతం అక్కడ వైసీపీ నుంచి పెండెం దొరబాబు ఉన్నారు.. గతంలో ఇక్కడి నుంచే పీఆర్పీ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన వంగా గీత ప్రస్తుతం కాకినాడ ఎంపీగా ఉన్నారు. ఇలా రకరకాల ఈక్వేషన్లు చూసుకుని? సాధ్యా సాధ్యాలను పరిశీలించాకే చెబుతామని ముద్రగడకు వర్తమానం అందినట్టు చెప్పుకుంటున్నారు. గట్టి పోటీ ఇచ్చి జయాపజయాలను ప్రభావితం చేయగల అభ్యర్థి కోసమే వైసీపీ వెదుకుతోందన్నది పార్టీ వర్గాల మాట. పార్టీ ఇమేజ్‌తో సంబంధం లేకుండా వ్యక్తిగత కరిష్మా ఉన్న అభ్యర్థులవైపు మొగ్గుతోందట వైసీపీ. అందుకే.. ఒకవేళ ముద్రగడ కుమారుడికి సీటు ఇవ్వడం సాధ్యం కాకుంటే?వేరే విధంగా న్యాయం చేస్తామని చెప్తోంది వైసీపీ నాయకత్వం.మొత్తానికి పొలిటికల్ స్క్రీన్ పై మళ్ళీ కనిపించడానికి ముద్రగడ ప్రయత్నాలు చేస్తున్నారన్నది మాత్రం వాస్తవం. వైసీపీ కూడా ఆయనకు ఎర్ర తివాచీ పరిచినట్టే పరిచి ప్లస్‌లు, మైనస్‌ల లెక్కలు వేస్తోంది. పద్మనాభం కూడా తనకంటే? కుమారుడి రాజకీయ భవిష్యత్ ముఖ్యం కనుక ఏదో రూపంలో అతన్ని బరిలో దింపి పొలిటికల్‌గా సెట్ చేయాలని చూస్తున్నారట.

## జైల్ సూపరింటెండెంట్ ఆకస్మిక బదిలీ

రాజమండ్రి, మే 6, రాజమండ్రి సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాజారావు ఆకస్మిక బదిలీ అయ్యారు. విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్.రాహుల్‌ను రాజమండ్రికి నియమించారు. రాజారావును నెల్లూరులోని కేంద్ర కారాగారాల శిక్షణ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేసింది ఏపీ ప్రభుత్వం. ప్రస్తుతం సూపరింటెండెంట్ ఆకస్మిక బదిలీ చుట్టూ రాజకీయం అలముకుంది.రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ మామ ఆదిరెడ్డి అప్పారావు, భర్త ఆదిరెడ్డి వాసు అరెస్టుల అనంతరం రిమాండ్‌లో భాగంగా రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ఆదిరెడ్డి కుటుంబం నిర్వహిస్తున్న చిట్‌ఫండ్ కంపెనీల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో సీఐడీ పోలీసులు ఆ కంపెనీల్లో తనిఖీలు నిర్వహించి ఆదిరెడ్డి అప్పారావు, వాసులను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆదిరెడ్డి కుటుంబాన్ని టీడీపీ నాయకులు వరుసగా వచ్చి కలుస్తుండడం, ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేయడం జరుగుతోంది.టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం రాజమండ్రి సెంట్రల్ జైలుకు వచ్చి ములాఖత్ ద్వారా సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆదిరెడ్డి అప్పారావు, వాసులను కలిసేందుకు దరఖాస్తు చేయించారు. అయితే ఈ ప్రక్రియ అంతా మెయిల్ ద్వారా చేపట్టగా దీనికి సూపరెంటెండెంట్ రాజారావు అనుమతిని ఇచ్చారు. చంద్రబాబుతోపాటు మరో వ్యక్తికి మాత్రమే ములాఖత్ అవకాశం కల్పించారు. మెయిల్ ద్వారా ములాఖత్‌కు దరఖాస్తు చేయడమే కాకుండా మాజీ మంత్రి కేఎస్ జవహర్ ద్వారా నేరుగా జైలు సూపరింటెండెంట్ ను కలిసి ములాఖత్ అనుమతి కోసం పత్రాలు సమర్పించేందుకు వెళ్లగా దానికి అధికారులు తిరస్కరించారు. అప్పటికే మెయిల్ కు తమకు వివరాలు అందాయని, ఇక అవసరం లేదని తిరస్కరించారు. రాజమండ్రి సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాజారావు ఆకస్మిక బదిలీ వెనుక రాజకీయ కోణం ఉందని ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తున్నారు. ఆయన నిబంధనల ప్రకారమే చంద్రబాబుకు ములాఖత్ ద్వారా కలిసేందుకు అనుమతి ఇచ్చారని, దీంట్లో ఆయన చేసిన తప్పేముందని ప్రశ్నిస్తున్నారు. అయితే రిమాండ్‌లో సెంట్రల్ జైలులో ఉన్న ఆదిరెడ్డి అప్పారావు, వాసులకు జైలులో రాచమర్యాదలు చేయిస్తున్నారని, టీడీపీ నాయకులు కలిసేందుకు అనుమతులు ఇస్తున్నారని ప్రధాన ఆరోపణలు చేస్తూ రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ ఉభయ గోదావరి జిల్లాల వైసీపీ ఇంచార్జి మిథున్‌రెడ్డికి ఫిర్యాదు చేశారని, ఈ క్రమంలోనే ఆయన అధిష్టానంతో మాట్లాడి వెంటనే రాజారావును వేరే చోటకు ఆకస్మికంగా బదిలీ చేయించారని పొలిటికల్ సర్కిల్‌లో సర్క్యులేట్ అవుతోంది.

## డ్రోన్ పైలట్ల కొలువులకు ఏపీ సర్కారు ప్రణాళికలు

విజయవాడ, మే 6, ఈ మధ్యకాలంలో డ్రోన్ల వినియోగం పెరిగిన విషయం తెలిసిందే. సర్వేలకు, పంట నష్టాల పరిశీలనకు, ఇతర అవసరాలకు డ్రోన్ల వాడకం పెరిగిపోయింది. వ్యవసాయ రంగంలో ఎరువులు, పురుగు మందుల పిచికారీ, ఇతర అవసరాలకు రైతులకు డ్రోన్లు ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయి. వ్యవసాయంతో పాటు ఇతర రంగాల్లో డ్రోన్ల వాడకం అనివార్యంగా మారింది. అయితే ఈ డ్రోన్లను ఆపరేట్ చేయడానికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన వారి అవసరం కూడా పెరుగుతోంది. ఇలా కొత్త కొలువులు సృష్టి జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ లోని వైఎస్సార్ ప్రభుత్వం ఈ కొత్త కొలువులను గ్రామీణ యువతకు అందివ్వాలని ప్రణాళికలు రచిస్తోంది. తద్వారా యువతకు ఉపాధి కల్పించాలని భావిస్తోంది. రాష్ట్రంలో ఒక్క వ్యవసాయ అవసరానికే 20 వేల మంది డ్రోన్ పైలట్లు అవసరం అవుతారని అంచనా. ఇతర అవసరాల కోసం కూడా పరిగణనలోకి తీసుకుంటే దాదాపు 80 వేల మంది డ్రోన్ పైలట్లు కావాల్సిందే. ఈ నేపథ్యంలో గ్రామీణ నిరుద్యోగ యువతకు డ్రోన్ పైలట్లుగా శిక్షణ ఇచ్చి వారిని ప్రొఫెషనల్స్ గా తీర్చిదిద్దాలని జగన్ సర్కారు సంకల్పించింది. ఈ శిక్షణను ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా 12 రోజుల పాటు అందించే సర్టిఫికేట్ కోర్సును రూపొందించింది. వ్యవసాయ కూలీల కొరతకు చెక్ పెట్టేందుకు రాష్ట్రంలో 10 వేల ఆర్బీకేల్లో కిసాన్ డ్రోన్లు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో అంటే జులైలోగా 500 ఆర్బీకేల పరిధిలో, డిసెంబర్ నాటికి మరో 1500 ఆర్బీకేల్లో కిసాన్ డ్రోన్లు అందుబాటులో ఉంచాలని యోచిస్తోంది. డ్రోన్ల ఆపరేటింగ్ కోసం సీహెచ్సీ గ్రూపు చదువుకున్న రైతులకు ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గుంటూరు లాంలోని వ్యవసాయ డ్రోన్ పరిశోధన కేంద్రం సెంటర్ ఫర్ అప్సరా ద్వారా సంప్రదాయ వ్యవసాయ డ్రోన్ల రిమోట్ పైలెట్ ట్రైనింగ్ కోర్సు (ఆర్పీటీసీ)లో 12 రోజుల శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా పాఠ్య ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే 8 బ్యాచ్ లలో 135 మంది రైతులకు శిక్షణ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. మిలిగిన వారికి జులై కల్లా శిక్షణ పూర్తి చేస్తారు. ఇప్పుడు యువతకూ ఈ శిక్షణ ఇవ్వనున్నారువ్యవసాయ డిప్లొమా, లేదా ఏదైనా ఇంజినీరింగ్ పట్టభద్రులైన యువతకు ఈ శిక్షణ ఇస్తారు. కనీసం మూడేళ్ల పాటు ఆర్బీకేల్లో పని చేసేందుకు ముందుకు వచ్చే వారికే డ్రోన్ పైలట్ శిక్షణ ఉచితంగా ఇస్తారు. ఇతర రంగాల్లో డ్రోన్లపై శిక్షణ పొందాలంటే ఫీజులు చెల్లించాలి. జులై నుండి దశల వారీగా ఈ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. ఇందుకోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కొత్తగా అప్సరా కేంద్రంతో పాటు తిరుపతి, కడప, మార్టేరు, విజయనగరంలో ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో శిక్షణ ఇచ్చేందుకు 20 మంది మాస్టర్ ట్రైనీలు నియమించనున్నారు. ఇప్పటికే 10 మంది శాస్త్రవేత్తలతో పాటు విశ్వవిద్యాలయంలో వ్యవసాయ డిప్లొమా చదువుతున్న 125 మందికీ అప్సరా ప్రత్యేక శిక్షణ ఇచ్చింది.

## చిన తిరుమలలో భక్తుల రద్దీ




**స్వామివారి దర్శనానికి క్యూకట్టిన భక్తులు..**

**గోవిందనామాలతో పులకించిన శ్రీవారి క్షేత్రం**

ద్వారకా తిరుమల ద్వారకాతిరుమల శ్రీనివాసా గోవిందా.. వేంకటరమణా గోవిందా అంటూ స్వామి వారి ఆలయానికి వచ్చిన యాత్రికులు భక్తివిశ్వాసాలతో తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. శ్రీవారి పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శనివారం భక్తుల రాకతో కళకళలాడింది. స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో ఆలయానికి దాదాపు 6వేల మంది పైబడి యాత్రికులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. పెరిగిన భక్తుల రద్దీ ఆలయానికి వచ్చిన పలువురు యాత్రికలు ముందుగా కేశఖండనశాలలో మొక్కుబడులు తీర్చుకున్నారు. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీవారి సాధారణ దర్శనానికి సుమారు 2 గంటల పైబడి సమయం పట్టింది.

# జనసేనలో నాదెండ్లకు ప్రాధాన్యత తగ్గుతోందా ?

కాకినాడ, మే 6, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన నిర్ణయాత్మక శక్తిగా మారింది. అయితే పవన్ కల్యాణ్ మాత్రం సినిమాల్లో బిజీగా ఉన్నారు. ఇంకా ఫీల్డ్ లోకి రాలేదు. మొత్తం పార్టీలో నెంబర్ టుగా ఉన్న నాదెండ్ల మనోహర్ చూసుకుంటున్నారు. అయితే ఇటీవలి కాలంలో ఆయన ప్రాధాన్యాన్ని పవన్ కల్యాణ్ క్రమంగా తగ్గిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. దీనికి కారణం ఏమిటన్నది జనసేనలోనే విస్తృత చర్చ జరుగుతోంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇటీవల హఠాత్తుగా చంద్రబాబు ఇంటికి వెళ్లారు. చర్చలు జరిపారు. ఆయన ఒక్కరే వెళ్లారు. మీడియాతో కూడా మాట్లాడలేదు. పవన్ కల్యాణ్ ఇలా ఒక్కరే వెళ్లడం చూసి చాలా మంది ఆశ్చర్యపోయారు. ఎందుకంటే పవన్ రాజకీయ సమావేశాలు ఎలాంటివైనా పక్కన నాదెండ్ల మనోహర్ ఉండాల్సిందే. అందుకే నాదెండ్ల మనోహర్ ఏడి అన్న అనుమానం జనసేన వర్గాలకే కాదు ఇతర రాజకీయ పక్షాలకూ వచ్చింది. జనసేనలో పవన్ కల్యాణ్ తర్వాత నాదెండ్ల మనోహరే. అన్ని రాజకీయ వ్యవహారాలను ఆయనే చక్క బెడుతున్నారు. బీజేపీతో పొత్తు విషయంలోనూ ఆయనే ఎక్కువగా సమన్వయం చేసు?కుంటున్నారు. నాదెండ్ల మనోహర్ తండ్రి భాస్కర్ రావు అధికారికంగానే బీజేపీలో చేరారు. పవన్ కల్యాణ్ సినిమాల్లో బిజీగా ఉంటే నాదెండ్లే మొత్తం పార్టీని నడిపిస్తున్నారు. విస్తృతంగా పర్యటిస్తున్నారు.అయితే



బీజేపీ హైకమాండ్‌తో జరిపిన చర్చలకు నాదెండ్ల కూడా వెళ్లారు. ఆ తర్వాతే నాదెండ్లకు రాజకీయంగా ప్రాధాన్యం ఇటీవల పవన్ కల్యాణ్ తగ్గిస్తున్నట్లుగా తెలుస్తోంది. కీలక రాజకీయ సమావేశాల్లో నాదెండ్ల పెద్దగా కనిపించడం లేదు. ఇటీవల హఠాత్తుగా జనసేన చీఫ్ పవన్ కల్యాణ్.. సోదరుడు నాగబాబుకు ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారు. అంటే ఇప్పుడు జనసేనలో నెంబర్ టు ఆయనే అనుకోవచ్చు. నాగబాబు పదవి చేపట్టగానే ముందుగా జనసేన క్యాడర్ మొత్తాన్ని తన గ్రిప్‌లోకి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. జిల్లాలు తిరగడానికన్నా ముందే టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. ఈ కాన్ఫరెన్స్‌లలోనూ నాదెండ్ల కనిపించడం లేదు. ఆయన వేరేగా జిల్లాల్లో పర్యటిస్తున్నారు. నాదెండ్ల ప్రాధాన్యతను వీలైనంతగా తగ్గించడానికే పవన్ కల్యాణ్ నాగబాబుకు బాధ్యతలిచ్చారన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తోంది. పవన్ కల్యాణ్ ఓ వైపు రాజకీయాలపై సమయం కేటాయించడం తక్కువగా ఉంది. గతంలో వారాంతాల్లో అయినా ఏపీలో పర్యటించేవారు. ఓ సమావేశంలో మాట్లాడేవారు. గత రెండు, మూడు నెలలుగా అదీ లేదు. ఎప్పుడో ఓ సారి బీజేపీ పెద్దలతో భేటీ.. లేకపోతే చంద్రబాబుతో భేటీ అంటూ వార్తల్లోకి వస్తున్నారు. వారాహీ వాహనం రెడీ చేసుకుని కావాల్సినంత ప్రచారం చేసుకున్నారు. కానీ ఇంత వరకూ రోడ్డెక్కలేదు. దీంతో పవన్ ..జనసేన పయనంపై ఆ పార్టీ క్యాడర్‌లో గందరగోళం ఏర్పడుతోంది. వీలైనంత త్వరగా పవన్ కల్యాణ్ ఫీల్డ్ లోకి రావాలని జనసైనికులు కోరుకుంటున్నారు. అయితే కీలక నిర్ణయాలు తీసుకునే .. రంగంలోకి దిగాలని పవన్ కల్యాణ్ అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది

## ఇబ్రహీంపట్నంలో ఉద్రిక్తత

మైలవరం మైలవరం నియోజకవర్గం మరో సారి హాట్ టాపిక్ గా మారింది. ఇబ్రహీంపట్నం లో వైసిపి మరియు టిడిపి మధ్య వార్ భగ్గుమంది. మాటల తూటాలు ఉద్రిక్తత కు దారి తీసింది. టీడీపీ కార్యకర్త ప్రకాష్, వైసీపీ కార్యకర్త బోస్ ల మధ్య వాగ్వాదం నెలకొంది. ప్రకాష్ ఇంటికి వైసీపీ కార్యకర్తలను తీసుకుని వెళ్లేందుకు బోస్ ప్రయత్నం చేసారు. ఇంటికి వస్తామని బెదిరిస్తున్నారంటూ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడానికి తెలుగుదేశం కార్యకర్తలు వెళ్లారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కు వైసీపీ మరియు టిడిపి కార్యకర్తలు చేరుకున్నారు. వారిని అతికష్టం తో పోలీసులు నిలువరించారు. పరిస్థితి ఉద్రిక్తతంగా మారింది.

## సీఆర్పిఎఫ్ జవాను అదృశ్యం

ఏలూరు ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం నూగొండపల్లిలోని 39వ బెటాలియన్ చెక్ పోస్ట్ దగ్గర విధులు నిర్వహించిన సీఆర్పిఎస్ జవాను అదృశ్యం అయ్యాడు. సిఆర్పిఎఫ్ కానిస్టేబుల్ బుర్ర. శ్రీనివాస్ (33) ఏప్రిల్ నెల 30వ తారీకు వరకు విధులు నిర్వహించాడు. చెక్ పోస్ట్ వీధులు పూర్తయిన అనంతరం గన్నవరం సిఆర్పిఎఫ్ కమాండ్ వద్ద రిపోర్ట్ చేయాల్సి వుంది. అయితే బుర్రి శ్రీనివాన్ రిపోర్ట్ చేయలేదు. జవాన్ కనిపించకపోవడంతో బెటాలియన్ కమాండర్ రమాకాంత్ పండా ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసారు. జవాన్ శ్రీనివాస్ తూర్పుగోదావరి జిల్లా మండల కేంద్రమైన అల్లవరం గ్రామానికి చెందినవాడు. ఆగిరిపల్లి ఎస్సై చంటిబాబు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## మహానాడు వేదికగా బిగ్ పొలిటికల్ బ్లాస్టింగ్...?

అమరావతి మే 6 తెలుగుదేశం పార్టీ ప్రతీ ఏటా మహానాడు నిర్వహించడం ఆచారంగా వస్తోంది. గత ఏడాది ఒంగోలులో మహానాడు నిర్వహించి పార్టీకి ఊపు తెచ్చింది. ఈసారి గోదావరి జిల్లాల ముఖ ద్వారం అయిన రాజమండ్రీలో మహానాడు నిర్వహించాలని చూస్తోంది. ఈ నెల 27 28 తేదీలలో జరిగే ఈ మహానాడులో రాజకీయ సంచలనాలు అనేకం ఉంటాయని తెలుస్తోంది.మహానాడు తరువాత ఎన్నికలకు వెళ్లడమే జరుగుతుంది కాబట్టి ఇది పార్టీకి చాలా అవసరంగా చెబుతున్నారు. మహానాడు లో రాజకీయ తీర్మానాలు అన్నీ కూడా అదే విధంగా ఉంటాయని తెలుస్తోంది. అలాగే ఈసారి మహానాడులో వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వస్తే ఏమి చేయబోతోంది అన్న దాని మీద కూడా ప్రజలకు బాబు తెలియచేస్తారని అంటున్నారు.చంద్రబాబు ముగింపు ప్రసంగంలో అనేక హైలెట్స్ ఉండేలా చూస్తున్నారు. అదే విధంగా మహానాడులో పొత్తుల విషయం కూడా చంద్రబాబు ప్రస్తావిస్తారని తెలుస్తోంది. ఒక విధంగా ఏపీలో గత ఏడాదిగా కొనసాగుతున్న పొత్తుల ఎత్తులు అనేక చర్చకు సందేహాలకు ఒక ముగింపు ఇచ్చేలా కీలక సందేశం ఇస్తారని అంటున్నారు.ఇక వీటన్నిటికంటే రాజకీయంగా వైసీపీని దెబ్బ తీసే విధంగా బాబు కొత్త వ్యూహాలు రచిస్తున్నారు. ఈసారి మహానాడులో వైసీపీ నుంచి భారీ చేరికలకు ప్లాన్ వేస్తున్నారు ఇప్పటికే వైసీపీ నలుగురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసింది. అదే సమయంలో మరికొందరు వైసీపీలో అసంతృప్తితో ఉన్నారని అంటున్నారు.ఇలా ఉన్న వారిని టీడీపీ ఐడెంటిఫై చేసిందట. వారితో సంప్రదింపులు జరుగుతున్నాయని అంటున్నారు. ఇలా పార్టీ వైపు వచ్చిన వారిని చేర్చుకోవాలని కూడా వైసీపీ మాస్టర్ ప్లాన్ వేస్తోంది. ఇక నెల్లూరు జిల్లా నుంచి రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి రెండు రోజుల క్రితం రాజమండ్రీ వచ్చి టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ కుటుంబాన్ని పరామర్శించి వెళ్లారు.అంతే కాదు ఆయన ఒక అరగంటకు పైగా స్థానిక ఎమ్మెల్యే టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కూడా భేటీ అయ్యారు. ఈ భేటీ విషయం సంచలనంగా మారింది. ఈ సందర్భంగా కోటం రెడ్డి కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. టీడీపీ కానీ జనసేన కానీ టికెట్ ఇస్తామని హామీ ఇస్తే మాత్రం వైసీపీ నుంచి పెద్ద ఎత్తున వలసలు ఉంటాయని. మరి కోటం రెడ్డి ఊరికే ఆ మాటలు అన్నారా లేక రాజకీయంగా వీటికి ప్రాధాన్యత ఉందా అన్న దాని మీద కూడా అంతా చర్చిస్తున్నారు.మరో వైపు చూస్తే టీడీపీ ఎక్కువగా నెల్లూరు ప్రకాశం జిల్లాల మీద ఫోకస్ పెట్టింది. గత ఎన్నికల్లో నెల్లూరులో పదికి పది సీట్లను వైసీపీ సాధించింది. ఇక ప్రకాశం జిల్లాలో పన్నెండు సీట్లకు గానూ ఎనిమిదింటిని గెలుచుకుని వైసీపీ జెండా ఎగరవేసింది. అలాంటి చోట ఇపుడు వైసీపీలో లుకలుకలు కనిపిస్తునాయి.అవి ఎక్కడా ఆగడంలేదు. దాంతోనే ఇపుడు టీడీపీ వైసీపీని టార్గెట్ చేస్తోంది అని అంటున్నారు. వైసీపీ నేతలు వేసుకుంటున్న అంచనాలు చంద్రబాబు రాజకీయ చాణక్యం కనుక వర్కౌట్ అయితే ఎవరూ ఊహించని ముఖాలే మహానాడు వేదిక మీద వైసీపీ నుంచి కనిపిస్తాయని. అలా తెలుగుదేశంలో చేరికలకు మంచి ఊపు వస్తుందని తేవాలని తమ్ముళ్ళు ఆరాటపడుతున్నారు.ఏది ఏమైనా ఈసారి మహానాడుతో ఏపీ రాజకీయాలను కీలకమైన మలుపు తిప్పాలని చంద్రబాబు చూస్తున్నారు. దానికి తగినట్లుగా ఆయన యాక్షన్ ప్లాన్ రెడీ చేసి పెట్టుకుంటున్నారు మరి చంద్రబాబు రాజకీయం సక్సెస్ అవుతుందా. వైసీపీ నుంచి సస్పెండ్ అయిన వారితో పాటు కొత్త వారు ఎవరైనా టీడీపీ వైపు అడుగులు వేస్తారా అన్నది తెలియాలంటే ఈ నెల 27 వరకూ వేచి చూడాల్సిందే అంటున్నారు.

# ఏ గట్టునుండాలో... ఆ గట్టునుండాలో....

కడప, మే 6, కడప జిల్లా జమ్మలమడుగులో మొదట్నుంచీ డిఫరెంట్ పాలిటిక్స్ ఉన్నాయి. ఇక్కడ రాజకీయ ఆధిపత్యం కోసమే మూడు దశాబ్దాలకు పైగా దేవగుడి, పొన్నపురెడ్డి కుటుంబాల మధ్య పోరు నడిచింది. 2014 ఎన్నికల తర్వాత దేవగుడి కుటుంబం వైసీపీ నుంచి టీడీపీలో చేరింది. పాత వైరాన్ని పక్కనబెట్టి రెండు కుటుంబాలు చేతులు కలపడంతో ..ఆల్ ఈజ్ వెల్ అనుకున్నారు అంతా. కానీ? 2019 ఎన్నికల తర్వాత పొలిటికల్ సీన్ మారిపోయింది. రాజీ చేసుకున్నాక టీడీపీలోనే ఉన్న మాజీ మంత్రులు దేవగుడి ఆదినారాయణరెడ్డి, పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి పార్టీలు మారిపోయారు. పి.రామసుబ్బారెడ్డి కుటుంబం వైసీపీలోకి వెళితే.. ఆదినారాయణరెడ్డి బీజేపీ పంచన చేరారు. ఆయన అన్న, మాజీ ఎమ్మెల్యే దేవగుడి నారాయణరెడ్డి మాత్రం టీడీపీలోనే ఉండిపోయారు. ఈ ఈక్వేషన్సే ఇప్పుడు ఆసక్తికరంగా మారి కొత్త రాజకీయానికి తెరలేపబోతున్నాయి.ఒకరు బీజేపీలో, మరొకరు టీడీపీలో ఉన్నా?దేవగుడి బ్రదర్స్ మధ్య విభేదాలు లేవని అనుకున్నారు అంతా. కానీ? అంత సీన్ లేదన్న విషయం తాజాగా జరుగుతున్న పరిణామాలను బట్టి అర్థం అవుతోంది. ఈసారి జమ్మలమడుగు టీడీపీ టిక్కెట్‌ను నారాయణరెడ్డి కుమారుడు భూపేష్‌కు ఇవ్వాలని నిర్ణయించింది అధినాయకత్వం. ఈ మేరకు క్లారిటీ కూడా ఇచ్చేసింది. బీజేపీలో ఉన్న ఆదినారాయణరెడ్డి సైతం అప్పట్లో ఈ నిర్ణయంపై పాజిటివ్‌గానే స్పందించారు. కానీ? ఈసారి భూపేష్ టీడీపీ నుంచి పోటీ చేస్తే.. తాను బీజేపీ తరపున బరిలో ఉంటానని ఆయన చేసిన తాజా ప్రకటన ఉత్కంఠ పెంచుతోంది. ఏడాది నుంచే తన పోటీకి సంబంధించిన ఏర్పాట్లు చేసుకుంటూ జనంలో ఉంటున్నారు భూపేష్. దీంతో బాబాయ్ ఆదినారాయణరెడ్డి సైలెంట్ అయి అబ్బాయికి సహకరిస్తారని అనుకున్నారు అంతా. కానీ? ఒక్క ప్రకటనతో సీన్ మొత్తం మారిపోయింది. దేవగుడి కుటుంబ సభ్యుల మధ్యనే పోటీ తప్పదన్న అంచనాలు పెరుగుతున్నాయి.నారాయణరెడ్డి అయినా?. ఆదినారాయణరెడ్డి అయినా ఒకటేనని అనుకున్నారు ఇన్నాళ్ళు ఆ కుటుంబాన్ని అభిమానించే వారంతా. నియోజకవర్గంలో వాళ్ళ అభిమానుల సంఖ్య కూడా ఎక్కువే. దీంతో ఇప్పుడు ఎవర్ని సపోర్ట్ చేయాలో అర్థంగాక బుర్రలు గొక్కుంటున్నారట అనుచరగణం. ఇక్కడ ఇంకో ట్విస్ట్ కూడా ఉంది. స్వయంగా ఆదినారాయణరెడ్డే తనకు దగ్గరగా ఉండేవారితో చెబుతున్నారట. నిజంగా అదే జరిగితే.. పొత్తులో సీటు బాబాయ్ తీసుకుంటారా? అబ్బాయ్ తీసుకుంటారా అన్నది మరో ప్రశ్న అట. అదెలా ఉన్నా.. ప్రస్తుతం దేవగుడి ఫ్యామిలీలో ఏర్పడ్డ విభేదాలు వైసీపికి లాభించే అవకాశం లేకపోలేదన్న విశ్లేషణలు సైతం పెరుగుతున్నాయి. మొత్తంగా ఈ రాజకీయ కుటుంబంలో ఏర్పడ్డ చిచ్చు చల్లారుతుందా? లేక పెరిగి పెద్దదవుతుందా? అన్నదాన్ని బట్టి జమ్మలమడుగు పొలిటికల్ ముఖ చిత్రం మారుతుందన్నది మాత్రం ఖాయం.

# తీవ్ర భావోద్వేగానికి లోనై కంట తడిపెట్టిన బాలినేని..

అమరావతి మే 6 ఏపీ మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వైసీపీలో సంచలనాలకు కేరాఫ్‌గా తయారయ్యారు. ఈ మధ్య ఎక్కడ చూసినా.. ఎవరినోట విన్నా బాలినేని.. బాలినేని అనే వస్తోంది. తనకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రాధాన్యత తగ్గించారని.. అది కూడా వైసీపీ నేతలు ఈ పనిచేస్తున్నారని తీవ్ర అసంతృప్తితో అధిష్టానం తనకిచ్చిన రీజనల్ కో-ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేయడం పెను సంచలనమే అయ్యింది. ఆ తర్వాత బాలినేని ఫోన్‌కాల్‌కు, నియోజకవర్గంలో కూడా అందుబాటులో లేకుండా హైదరాబాద్‌లోనే వారం రోజులపాటు ఉండిపోయారు. పార్టీ ముఖ్యనేతలతో జగన్ మాట్లాడించినా వర్కవుట్ అవ్వకపోవడంతో ఇక డైరెక్టుగా సీఎం రంగంలోకి దిగి తాడేపల్లిలోని క్యాంప్ ఆఫీసుకు రప్పించుకున్నారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, బాలినేని ఇద్దర్నీ కూర్చోబెట్టి 45 నిమిషాలకు పైగా బుజ్జగించినా ఫలితం లేకపోయింది. ఆఖరికి తీవ్ర అసంతృప్తితోనే సమావేశం నుంచి బయటికొచ్చారు. అక్కడ్నుంచి నేరుగా మీడియా కంట పడకుండానే హైదరాబాద్ వెళ్లిపోయారు. భాగ్యనగరం నుంచి ఒంగోలుకు వెళ్లిన బాలినేని అనూహ్యంగా మరో బాంబ్ పేల్చారు. ఈసారి బాలినేని చేసిన కామెంట్స్ రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశం అయ్యాయి.ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ' నాకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ భిక్ష పెట్టారు. 1999 లో నేను రాజకీయాల్లోకి వచ్చాను. 2009లో వైఎస్సార్ మంత్రి పదవి ఇచ్చారు. వైఎస్సార్ మరణం నా రాజకీయ జీవితంలో తీరని లోటు. జగన్ ఓదార్పు యాత్ర సమయంలో మంత్రి పదవి తీస్తామని చెప్పినా లెక్క చెయ్యలేదు. జగన్ వెంటే నేను నడిచాను. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కీలక నేతగా పని చేశాను. ఈ మధ్య చెన్నై హవాలా , భూ కబ్జాలు, సినీమాలో పెట్టుబడులు అని నాపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. వైసీపీ కోసం ఎంతో శ్రమించా.. ఎన్నో అవమానాలు పడ్డాను. కానీ నాపై నిందలు, ఆరోపణలను భరించలేకపోతున్నా' అని బాలినేని తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. 'నేను తప్పు చేసినట్టు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా. గోనె ప్రకాశ్‌కు నా గురించి మాట్లాడాల్సిన అవసరం ఏముంది?. గోనెతో కావాలనే కొందరు మాట్లాడిస్తున్నట్లు ఉంది. వైవీ సుబ్బారెడ్డి, అతని భార్యను పొగిడిన గోనె.. జగన్, భారతిని విమర్శిస్తున్నారు. రాజకీయాల్లో విశ్వసనీయత ఉండాలి' అని బాలినేని చెప్పుకొచ్చారు.

ఇంతకీ గోనె ఏమన్నారు..?

వాస్తవానికి గత కొన్నిరోజులు బాలినేని పార్టీ మారుతున్నట్లు పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. సరిగ్గా ఇదే టైమ్‌లో మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్ రావు మీడియా ముందుకొచ్చి బాలినేని గురించి మాట్లాడుతూ తీవ్ర విమర్శలు గుప్పించారు. బాలినేనికి వందల కోట్లు ఎలా వచ్చాయి..? విదేశాల్లో గ్యాంబ్లింగ్‌లు ఆడిన చరిత్ర బాలినేనిదని గోనే చెప్పుకొచ్చారు. అంతేకాదు.. ఈ గ్యాంబ్లింగ్ కోసం స్పెషల్ ఫ్లైట్లలో కూడా వెళ్లారని ఆయన విమర్శించారు. వైవీ సుబ్బారెడ్డి దయవల్లే బాలినేని ఎమ్మెల్యే అయ్యారని.. అలాంటి వైవీని ఆడిపోసుకోవద్దని సూచించారు. అంతటితో ఆగని గోనె.. బాలినేని టీడీపీలోకి వెళ్తున్నారనే ప్రచారం కూడా జరుగుతోందని వ్యాఖ్యానించడం ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశం అయ్యింది. గోనె చేసిన ఈ వ్యాఖ్యలకు బాలినేని పై విధంగా స్పందించారు.

సొంత పార్టీ నేతలపై బాలినేని తీవ్ర అసంతృప్తి..

గోనె గురించి మాట్లాడిన తర్వాత సొంత పార్టీ నేతలపై బాలినేని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'వైసీపీ కోసం ఎంత శ్రమించానో, ఎంత కష్టపడ్డానో నాకు తెలుసు. నేను పార్టీ మారుతానని మా నేతలే ప్రచారం చేస్తున్నారు. కార్యకర్తలకు న్యాయం చేయలేనప్పుడు పదవులు ఎందుకు..?. రీజనల్ కోఆర్డినేటర్ పదవి చెయ్యలేనని సీఎం జగన్‌కి నేనే చెప్పా. నాపై ఎమ్మెల్యేలతో సీఎంకు ఫిర్యాదు చేయిస్తున్నారు. నన్ను ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా వైసీపీ కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటా. కార్యకర్తలకి న్యాయం చేస్తుంటే నాపై ఆరోపణలు చేస్తున్నారు. ఆరోపణలు చేసే వాళ్ళు ఒక్క ఆరోపణ అయినా రుజువు చేయాలి. నేను టికెట్ ఇప్పించిన వాళ్లే నన్ను టార్గెట్ చేస్తున్నారు' అని జిల్లాకు చెందిన కొందరు ఎమ్మెల్యేలతో పాటు పరోక్షంగా పార్టీ పెద్దలపై కూడా బాలినేని విమర్శలు గుప్పించారు.

మొత్తానికి చూస్తే.. బాలినేని ఎపిసోడ్ రోజురోజుకూ పెరుగుతోందే తప్ప ఫుల్‌స్టాప్ పడే పరిస్థితులు మాత్రం కనిపించట్లేదు. ఇప్పటికే వైసీపీలో ఈయన కామెంట్స్ హాట్ టాపిక్ అవ్వగా తాజాగా చేసిన కామెంట్స్‌కు ఏ పరిణామాలకు దారితీస్తాయో తెలియని పరిస్థితి.

## భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు, మన్యం వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు

**-నేడు విప్లవ వీరుడు అల్లూరి వర్ధంతి**

మన్యం ప్రజల హక్కుల కోసం, భారతమాత స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి. రెండేళ్ల పాటు బ్రిటిషర్లకు కంటిమీద కనుకులేకుండా చేసిన సీతారామరాజు.. తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణత్యాగం చేశారు. 1924 మే 7న శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయారు. నేడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి. ఈ సందర్భంగా ఆ మహావీరుడిని ఒకసారి స్మరించుకుందాం...అల్లూరి సీతారామరాజు 1897 జులై 4న విశాఖపట్నం జిల్లా పాండ్రంగిలో జన్మించారు. అయితే పెరిగింది మాత్రం పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లులో. రామరాజు తండ్రి వెంకట రామరాజు, తల్లి సూర్యనారాయణమ్మ. 9వ తరగతి వరకు చదివిన అల్లూరి.. సంస్కృతం, జోతిష్యశాస్త్రం, జాతక శాస్త్రం, విలువిద్య, గుర్రపు స్వారీలో ప్రావీణ్యం పొందారు. 1917లో విశాఖపట్నం జిల్లా క్రిష్ణదేవీపేట ద్వారా మన్యంలోకి అడుగుపెట్టారు. మన్యం ప్రజల దీన స్థితిగతులను పరిశీలించి, బ్రిటిష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా విప్లవానికి సిద్ధం కావాలని మన్యం ప్రజలను పురిగొల్పారు. సీతారామరాజు ప్రధాన అనుచరుడు, సేనాని గాం గంటందొర. ఈయనది నడింపాలెం గ్రామం.గంటందొర, మిగిలిన అనుచరుల సాయంతో బ్రిటిష్ అధికారులపై విప్లవానికి అల్లూరి తెరతీశారు. 1922 ఆగస్టు 22న చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై తొలిసారి దాడి చేశారు. 23వ తేదీన క్రిష్ణదేవీపేట పోలీస్ స్టేషన్, 24న తూర్పుగోదావరి జిల్లా రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌పై దాడిచేశారు. ఈ మూడు స్టేషన్లపై దాడి ద్వారా భారీగా ఆయుధాలను సేకరించుకొని విప్లవం ప్రారంభించారు. ఇక అక్కడి నుంచి వరసపెట్టి పోలీస్ స్టేషన్లపై దాడులు చేస్తూ బ్రిటిష్ అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు అల్లూరి. ఈ విప్లవాన్ని ఎలాగైనా అణచివేయాలని నిర్ణయించుకున్న బ్రిటిష్ ప్రభుత్వం.. మన్యంలో ముమ్మర చర్యలు చేపట్టి చాలా మంది రాజు అనుచరులను చంపేసింది.బ్రిటిష్ ప్రభుత్వం మన్యం ప్రజలను కాల్చుకు తినడం మొదలుపెట్టింది. ప్రభుత్వం ప్రజలను పెడుతున్న కష్టాలను చూడలేని రాజు ప్రాణత్యాగానికి సిద్ధపడ్డారు. 1924 మే 7న విశాఖపట్నం జిల్లా మంప గ్రామానికి సమీపాన రాజు స్వయంగా లొంగిపోయారు. సీతారామరాజుపై పగతో రగిలిపోతున్న బ్రిటిష్ అధికారులు ఆయన్ని చింతచెట్టుకు కట్టి కాల్చిచంపారు. మే 8న రాజు అనుచరులు ఆయన భౌతికకాయాన్ని క్రిష్ణదేవీపేటకు తీసుకువచ్చి తాండవనది పక్కన దహన క్రియలు జరిపారు. సీతారామరాజు ఆశించి కలలుగన్న స్వాతంత్ర్యం ఆయన ఆత్మత్యాగం చేసిన 28 సంవత్సరాలకు ఆగస్టు 15, 1947న భారత ప్రజలకు లభించింది.

## అన్నమయ్య గొప్ప సామాజిక సంస్కర్త

కాకినాడ ఆనాటి సాంఘిక విశేషాలు, ఆచారాలు, ప్రజల జీవన విధానాలపై సంకీర్తన చేసిన అన్నమయ్య ధన్యుడని నాట్య మయూరి, నృత్య కౌముది, సిరిమువ్వ ఎన్. సి హెచ్. లక్ష్మీ శాంతి పేర్కొన్నారు .రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పద కవితా పితామహుడిగా ప్రసిద్ధి చెందిన అన్నమయ్య తొలి తెలుగు వాగ్గేయకారుడని అన్నారు. తన జీవితాన్ని శ్రీ వెంకటేశ్వర స్వామి కైంకర్యానికి అంకితం చేసిన ధన్యజీవని అన్నారు. అనేక సంప్రదాయాల్లో రచనలు చేసి తర్వాత పదకర్తలకు మార్గదర్శకుడు అయ్యారని లక్ష్మీ శాంతి తెలిపారు . ప్రముఖ సాహిత్య వేత్త డాక్టర్ శిరీష మాట్లాడుతూ జాతి, మత, కులాన్ని విడనాడాలని, మనుషులంతా సమానమేనని అన్నమయ్య తన కీర్తనల ద్వారా తెలిపారని అన్నారు . ఈ సందర్భంగా గాయని అరబి అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో లక్ష్మీ శాంతిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బుద్ధరాజు సత్యనారాయణ రాజు , రేలంగి బాపరాజు, రాజా, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో ఏలూరు జిల్లాకు పదవ స్థానం

ఏలూరు పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ఏలూరు జిల్లా 22వ ర్యా0క్ దక్కించుకుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్ వి రవి సాగర్ శని వారం తెలిపారు.గత ఏడాది ఫలితాల కన్నా ఈ ఏడాది 7శాతం పెరిగినట్టు చెప్పారు.జిల్లాలో మొత్తం 22 వేల 259 మంది ఉత్తీర్ణులు కాగా వారిలో 11053 మంది బాలురు.11206 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యి తమ ప్రతిభను చాటుకుంది జిల్లా పేరు నిలబెట్టారన్నారు.ఈ పరీక్షలలో బాలురు 60.26 శాతం బాలికలు68.37 శాతం మొత్తం గా 64.35 శాతం ఉత్తీర్ణత సాధించారని డి ఈ ఓ రవి సాగర్ తెలిపారు

## అప్పనకు వైభవంగా రెండో విడత చందన సమర్పణ

విశాఖపట్నం సింహాచలం సింహాద్రినాథుడికి రెండో విడత చందన సమర్పణ కార్యక్రమాన్ని అర్చకులు వేద మంత్రాల నడుమ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని సింహాద్రి అప్పన్నకు పంచామృతాభిషేకం అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి 120 కిలోల చందనం సమర్పించారు. చందన సమర్పణ కారణంగా ఈరోజు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసారు.

# అధికారికం...8వేలు... అనధికారికం 20 వేలు

విశాఖపట్టణం, మే 6, (న్యూస్ పల్స్) సింహాచలం చందనోత్సవంలో జరిగిన గందరగోళం అంతా ఇంతా కాదు. ఇప్పుడు విచారణలో కూడా అదే రచ్చ.. బాధ్యత మీదంటే మీదని అటు పోలీసులు.. ఇటు దేవాదాయ శాఖ అధికారులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. అయితే ఇది పూర్తిగా దేవాదాయ శాఖ అధికారుల వైఫల్యమేనని, 8000 అంతరాలయం టికెట్లు ఇస్తామని 20వేల వరకు ముద్రించారని అందులో పెద్ద స్కాం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. కానీ విచారణ మాత్రం ఇంకా నత్తనడకనే సాగుతోంది.. సింహాద్రి అప్పన్న.. ఏంటి సామి ఇది..సింహాద్రి అప్పన నిజరూప దర్శనం అంటే ఉత్తరాంధ్ర వాసులకు పెద్ద పండగే.. ఏడాదిలో ఒక్కరోజే శ్రీ వరాహ నరసింహస్వామి భక్తులకు నిజరూప దర్శనం ఇస్తాడు. ప్రభుత్వాలు కూడా దీన్ని అత్యంత ప్రతిష్టాత్మకమైన రోజుగా భావించి ఆ మేరకు ఏర్పాట్లు చేపడతాయి. లక్షలాది మంది భక్తులు వచ్చే సందర్భం కాబట్టి రెవెన్యూ, పోలీస్, ఫైర్, పురపాలక, ఇరిగేషన్, విద్యుత్ శాఖ, లాంటి అనేక డిపార్ట్మెంట్ల సహకారంతో దేవాదాయ శాఖ ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తుంటుంది.దశాబ్దాలుగా జరుగుతున్న ప్రక్రియ కాబట్టి ఎంతమంది భక్తులొస్తారు..దర్శనానికి ఎంత సమయం పడుతుంది? ఎన్ని కేటగిరీలుగా విభజించాలి?. ఏ ఏ కేటగిరీలను ఎటునుంచి పంపాలి? లాంటి అనేక అంశాలతో పదుల సంఖ్యలో సమన్వయ కమిటీల సమావేశాలు జరుగుతుంటాయి. ఈ ఏడాది కూడా అలానే సమన్వయ కమిటీ సమావేశాలు జరిగాయి..కానీ నిజరూప దర్శనం నాడు మాత్రం ఆ ఐకమత్యం కనిపించలేదు..భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇక, అంతరాలయ దర్శనాల గందరగోళం అయితే అంతా ఇంతా కాదు. సాధారణంగా ఉత్సవ నిర్వహణ అంతా దేవాలయ శాఖ చేస్తూ ఉంటుంది ముందుగా జరిగే సమన్వయ కమిటీ సమావేశాల్లో నిర్ణయించుకున్న బాధ్యతల మేరకు ఇతర శాఖలు ఇన్వాల్వ్ అవుతాయి పోలీసులు యధావిధిగా భక్తులకు భద్రత క్యూలైన్లో తొక్కిసలాట లాంటివి జరగకుండా చూడ్డం.. ప్రశాంత వాతావరణంలో కార్యక్రమం జరిగేలా చూసే బాధ్యతలు నిర్వహిస్తుంటారు కార్యక్రమం నిర్వహణ పేరుకి దేవాదాయ శాఖ అయినప్పటికీ రెవెన్యూ శాఖ పెద్దన్న పాత్ర పోషిస్తుంది అందులోనూ ఈ ఉత్సవ కమిటీకి జిల్లా కలెక్టరే స్వయంగా చైర్మన్ కూడా కావడంతో రెవెన్యూ అధికారులకు కనీసంలోనే దేవాదాయ శాఖ ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తుంటుంది?అయితే తాజాగా జరిగిన గందరగోళానికి సంబంధించి జిల్లా కలెక్టర్ విచారణ అధికారిగా జాయింట్ కలెక్టర్ ని నియమించారు జాయింట్ కలెక్టర్ విశ్వనాథ్ ఉద్యోగులందరినీ కలెక్టరేట్కు పిలిపించి మరీ ఒక్కొక్కరిని విచారిస్తూ వాళ్ల నుంచి స్టేట్మెంట్స్ కూడా తీసుకున్నారు.. అయితే దేవాదాయ శాఖ ఉద్యోగులంతా ఈ వైఫల్యానికి కారణం పోలీసులని చెబుతున్నారట.. క్యూలైన్ల వద్ద జనాలను నియంత్రించాల్సిన పోలీసు అధికారులు మెహర్బానీ కోసం తమకు తెలిసిన వాళ్ళకి దర్శనం కలిగించడం కోసం క్యూ లైన్లను పక్కనపెట్టి ప్రత్యేక గేట్లను ఓపెన్ చేయడం ద్వారా వందలాదిగా అటువైపుగా వచ్చారని వాళ్లంతా అంతరాలయంలో చొరబడి ఎక్కువ సేపు ఉండడంతో ఈలోపు బయట ఆగిపోయిన వాళ్ళు ఆగిపోయారని స్వయంగా నగర మేయరే రెండు గంటల పాటు క్యూ లైన్ లో వేచి ఉండి దర్శనం చేసుకోగా ఇక స్వరూపానంద స్వామి కి కూడా దాదాపుగా అలాంటి చేదు అనుభవాలు ఎదురవడంతో ఆయన నేరుగా బయటకు వచ్చి కార్యక్రమం నిర్వాహకులపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. అది పెద్ద సంచలనమే అయింది.ఇక మంత్రి బొత్స కూడా తనను నిలదీసిన భక్తులకు నాకే మూడు గంటల సమయం పట్టిందని కాసేపు వేచి ఉండాలని కోరడం కనిపించిందనీ వీటన్నింటికీ కారణం పోలీసులే అని దేవాదాయ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారట.

# బీజేపీ ఛార్జ్ షీట్ ప్లానింగ్ కమిటీ సభ్యులుగా డాక్టర్ .బైరెడ్డి శబరి...

నంద్యాల మా ప్రతినిధి మే 6 :-బీజేపీ పార్టీ రాష్ట్రంలో వైసీపీ అక్రమాలపై ఛార్జ్ షీట్ దాఖలు చేసేందుకు ప్లానింగ్ కమిటీ ని ఏర్పాటు చేసింది. ఆ కమిటీలో సభ్యులుగా నంద్యాల జిల్లా నుంచి బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.బైరెడ్డి శబరి ని నియమించారు. ఈ మేరకు శనివారం డా.బైరెడ్డి శబరి ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వంలో ఎంపీ, ఎమ్మెల్యే ల అరాచకాలు రోజు రోజుకు పెట్రేగి పోతున్నాయని అన్నారు. భూ కబ్జాలు, ఇసుక, మట్టి తవ్వకాలు, కమిషన్లు ఇలా వీరి అక్రమ దందాల గురించి చెప్పుకుంటే పోతే ముగింపు అనేది ఉండదన్నారు. ఎవరైనా మీ నియోజక వర్గ ఎమ్మెల్యే లేదా వారి అనుచరుల అవినీతి, అక్రమాలకు సంబంధించి వివరాలను మా ముందుకు తీసుక వస్తే వారి ఆగడాలపై ఛార్జ్ షీట్ దాఖలు చేస్తామని హామీ ఇస్తున్నామన్నామని ఆమె తెలిపారు.



# ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన భూములపై బహిరంగ చర్చకు సిద్ధం

**దుష్ట రైతు సంఘాల శక్తులు అనడం రైతాంగాన్ని అవమానపరచడమే బొజ్జా దశరథరామిరెడ్డి**

నంద్యాల మా ప్రతినిధి మే 6 విభారె న్యూస్ :- మెడికల్ కాలేజి ఏర్పాటుపై ప్రభుత్వ నిర్ణయాన్ని రాయలసీమ సాగునీటి సాధన సమితి స్వాగతించిందని అయితే ప్రాంతీయ వ్యవసాయ భూములలో ఏర్పాటును వ్యతిరేంకించామని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ...రైతాంగ అభివృద్ధికి దోహదపడటమే గాక భారతదేశంలో ప్రఖ్యాతి గాంచిన నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం భూములలో మెడికల్ కాలేజి ఏర్పాటు చేస్తారన్న వార్తాల నేపథ్యంలో స్థానిక ప్రజా ప్రతినిధులను వ్యక్తిగతంగా కలిసి ఆర్ ఎ ఆర్ ఎస్ . ను పరిరక్షించాలని కోరామని అయితే వారి నుంచి ఏ స్పందన లేకపోవడంతో ఆర్ ఎ ఆర్ ఎస్ . ను కాపాడుకునేందుకు రైతులు కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజాప్రతినిధి దుష్ట రైతు సంఘాల శక్తులు అడ్డుకుంటున్నాయని ప్రకటన చేయడం రైతాంగాన్ని అవమానపరచడమేనని, దుష్ట శక్తులు ఏవో ప్రజల వద్దే తేల్చుకుందామని ఈ విషయంలో బహిరంగ చర్చకు సిద్ధమని దశరథరామిరెడ్డి సవాల్ చేసారు.. ఈ కార్యాలయంలో మహేశ్వరరెడ్డి, వెంకటేశ్వర నాయుడు, ఏరువ రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

# వేసవిలో సంగీత శిక్షణ తరగతులు...

**శిల్పా సేవ సమితి ఆధ్వర్యంలోన**



నంద్యాల మా ప్రతినిధి మే 6 విభారె న్యూస్ :-భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను నేటి తరం చిన్నారుల్లో పెంపొందించేందుకుగాను శిల్పా సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం నాడు వేసవి ఉచిత సంగీత శిక్షణ తరగతులను శిల్పా మహిళా సహకార బ్యాంక్ చైర్పర్సన్ నాగిని రవి సింగారెడ్డి ప్రారంభించారు..సంగీత శిక్షణలో 18 సంవత్సరముల అనుభవం కలిగిన సంగీత గురువు కళ్యాణిచే శిక్షణ అందించడం జరుగుతుందన్నారు , ఈ అవకాశాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని నాగిని రవి సింగారెడ్డి కోరారు.ఈ సందర్భంగా నాగిని రవి సింగారెడ్డి మాట్లాడుతూ. నేటి తరంలో చిన్నారులకు భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు, సంగీతం పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు తమ వంతుగా ఈ వేసవి కాలంలో శిల్పా సేవా సమితి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సంగీతంలో అపార అనుభవం కలిగిన కళ్యాణి సంగీత గురువులు చిన్నారులకు శిక్షణ అందిస్తారని పేర్కొన్నారు. సంగీతం నేర్చుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలిపారు. ఈ అవకాశాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు చిన్నారులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శిల్పా మహిళా సహకార బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరిలీల, సభ్యులు పాల్గొన్నారు.

# దుష్ట శక్తులు ఏవో ప్రజల వద్దే తేల్చుకుందాం...రా..

**ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన భూములపై బహిరంగ చర్చకు సిద్ధం**

**దుష్ట రైతు సంఘాల శక్తులు అనడం రైతాంగాన్ని అవమానపరచడమే--**

**బొజ్జా దశరథరామిరెడ్డి**

నంద్యాల మెడికల్ కాలేజి ఏర్పాటుపై ప్రభుత్వ నిర్ణయాన్ని రాయలసీమ సాగునీటి సాధన సమితి స్వాగతించిందని అయితే ప్రాంతీయ వ్యవసాయ భూములలో ఏర్పాటును వ్యతిరేంకించామని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ...రైతాంగ అభివృద్ధికి దోహదపడటమే గాక భారతదేశంలో ప్రఖ్యాతి గాంచిన నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం భూములలో మెడికల్ కాలేజి ఏర్పాటు చేస్తారన్న వార్తాల నేపథ్యంలో స్థానిక ప్రజా ప్రతినిధులను వ్యక్తిగతంగా కలిసి ఆర్ ఏ ఆర్ ఎస్ ను పరిరక్షించాలని కోరామని అయితే వారి నుంచి ఏ స్పందన లేకపోవడంతో ఆర్ ఏ ఆర్ ఎస్ ను కాపాడుకునేందుకు రైతులు కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని ఆయన వివరించారు.

# నంద్యాల జిల్లా ను చివరి స్థానానికి తీసుకువచ్చిన డిఇఓ అనురాధను సస్పెండ్ చేయాలి

**సిపిఐ డిమాండ్**



నంద్యాల మా ప్రతినిధి మే 6 విభారె న్యూస్ :-.నంద్యాల జిల్లాలో ప్రైవేటు. ప్రభుత్వ స్కూల్ లను శాఖా పరంగా పరిశీలిన చేయ కుండ కేవలం ఉపాధ్యాయ ఎన్నికలలో అవినీతి పాల్పడుతూ ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యంతో ఒప్పందం చేసుకొని ఓటుకు వెయ్యి రూపాయలు నగదు రూపంలో లంచం తీసుకొని దొంగ ఓట్లు నమోదు కోసం తీసుకున్న శ్రద్ధ ప్రభుత్వ ప్రైవేటు స్కూళ్లను పరిశీలన చేయకపోవడం వల్ల రాష్ట్రంలో పదవ తరగతి పరీక్ష ఫలితాలు జిల్లా చివరి స్థానం రావడం విచారకరమని ఇందుకు కారకురాలైన డి ఈ ఓ అనురాధాను వెంటనే సస్పెండ్ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి. ఎన్. రంగనాయుడు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.నంద్యాల జిల్లా లో ఎంతోమంది ప్రముఖులు ఉన్నత చదువులు చదివి పేరు ప్రఖ్యాతలు తెచ్చిన నంద్యాల జిల్లాను నేడు చదువులలో చివరి స్థానం తెచ్చిన ఘనత డీఈఓ అనురాధ గారని పరీక్ష సమయాలలో ప్రభుత్వ.ప్రైవేట్ స్కూళ్లను పరిశీలించి ఏ స్కూల్లో ఎంతవరకు పిల్లలు చదువుతున్నారు ఉపాధ్యాయులు ఎలా చదువు చెబుతున్నారో తెలుసుకోవాల్సిన బాధ్యత డీఈఓ అనురాధ గారిది కానీ మొన్న జరిగిన ఉపాధ్యాయ ఎన్నికలలో నంద్యాల జిల్లాలో అక్రమమైన పద్ధతిలో ప్రైవేట్ స్కూల్లో పనిచేసే ఆయాలతోపాటు దొంగ ఓట్లను నమోదు చేపించిన ఘనత ఆమెకు దక్కుతుందని ఇలాంటివారు నంద్యాల జిల్లాలో ఉన్నతమైన పదవులుంటే జిల్లా మరింత దిగజారి పోయే పరిస్థితి ఏర్పడుతుందని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు వెంటనే డిఇఓ అనురాధను వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

# దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన ఐటి అండ్ సి శాఖ కార్యదర్శి కోన శశిధర్, జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలానీ సమూన్



నంద్యాల మా ప్రతినిధి మే 6 విభారె న్యూస్ :-ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు సంబంధించి ప్రతి రైతు పొలానికి వెళ్లి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందనే ధైర్యాన్ని ఇవ్వాలని ఐటి అండ్ సి శాఖ కార్యదర్శి కోన శశిధర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బండి ఆత్మకూరు మండలం నారాయణపురం గ్రామంలో అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న వరి పంటలను జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలానీ సమూన్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 22, 26 తేదీలు ఈనెల 1వ తేదీ లలో కురిసిన అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న ప్రతి రైతు పొలం తిరిగి జరిగిన నష్టంపై ప్రభుత్వానికి నివేదిస్తామని రైతుకు భరోసా కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. నారాయణపురం గ్రామంలో దాదాపు 650 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశారని రాబోయే రెండు రోజుల్లో కూడా వర్షాలు ఉన్న నేపథ్యంలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వానికి నివేదికలు అందజేసేందుకు సిద్ధం కావాలని వ్యవసాయ అధికారులు ఆదేశించారు. బండి ఆత్మకూరు మండలంలోని ఐదు గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి స్పెషల్ అధికారికి వివరించారు.అనంతరం నారాయణపురం లోని రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందితో ఆయన మాట్లాడారు. ప్రతి రైతు పొలం తిరిగి వాస్తవాన్ని రికార్డ్ చేసి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు సీనియర్ అధికారులను జిల్లాలకు నియమించిందని ఈ క్రమంలో భాగంగా తాను పంట పొలాలను పరిశీలించడం జరిగిందని రైతులకు వివరించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఆపదలో ఉన్న రైతులు ఆదుకునేందుకే ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతుల కోసం వ్యవసాయ రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతోపాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సరఫరా చేయిస్తున్నామన్నారు. విత్తన విక్రయంలో, ప్రభుత్వ మద్దతు ధర విషయంలో, మధ్య దళారుల ప్రమేయం లాంటి సమస్యలను సీఎం యాప్ లో పోస్ట్ చేయాలని రైతు భరోసా కేంద్ర వ్యవసాయ సహాయకులను ఆయన ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నిశాంతి. టి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, ఆత్మకూరు, నంద్యాల ఆర్డీవోలు ఎం దాసు, శ్రీనివాసులు తదితర అధికారులు వారి వెంట ఉన్నారు.

# బజరంగ్ దళ్ ను నిషేధిస్తామన్న కాంగ్రెస్ కు "గట్టిబుద్ధి" చెబుదాం.....



కర్నూలు, మే 6విభారె న్యూస్ :కర్ణాటక రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో " బజరంగ్ దళ్ " ను నిషేధిస్తామన్న కాంగ్రెస్ కు తగిన బుద్ధి ప్రసాదించాలని కోరుతూ విశ్వ హిందూ పరిషత్ - బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టర్ కార్యాలయం ముందు గల మహాత్ముని ముందు తీవ్రమైన ఎండను కూడా లెఖ్ఖచేయక కార్యకర్తలందరూ రోడ్డు పై బైఠాయించి " హనుమాన్ చాలీసా " పారాయణం చేశారు అనంతరం విశ్వ హిందూ పరిషత్ కర్నూలు జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణమాట్లాడుతూ.... చరిత్రలో ఎప్పుడూ హిందువులకు వ్యతిరేకంగా పనిచేసే కాంగ్రెస్ పార్టీ ఈ సారి ఎన్నికల్లో మైనార్టీ వర్గాలను .సంతుష్టీకరణ కోసం జాతీయ భావాలతో ,నిరంతరం దేశంగురించి ఆలోచించే విశ్వ హిందూ పరిషత్ లోని యువ విభాగమైన " బజరంగ్ దళ్ " ను నిషేధిస్తామన్న విషయాన్ని తమ పార్టీ ఎన్నికల " మ్యానిఫేస్టో " ఉంచి దేశంలోని అన్ని మతాలను సమానంగా చూడవలసిన ఘన చరిత్రగల కాంగ్రెస్ పార్టీ ఒక వర్గం వారిని సంతోష పెట్టే ఓటు బ్యాంకు రాజకీయాలకు తెరతీసింది,అధికారం కోసం ఇంత దిగజారుడు తనం ప్రదర్శించడం కాంగ్రెస్ పార్టీ కే చెల్లిందని, దీనికి ప్రతిఫలం అనుభవించక తప్పదని,కర్ణాటక



**గోరంట్ల రమణ విశ్వ హిందూ పరిషత్ కర్నూలు జిల్లా అధ్యక్షులు...**



ఎన్నికలతో పాటు రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకు పోతుందని జోస్యం చెప్పారు, హనుమాన్ చాలీసా లో వచ్చే ఒక పంక్తిలో " కుమతి నివార సుమతి కే సంగీ " అని ఉన్నదనీ దాని అర్థం "దుర్బుద్ధిని తొలగించి సద్బుద్ధి ని ప్రసాదించే స్వామీ" అని ఈ కాంగ్రెస్ పార్టీ వాళ్ళ దుర్బుద్ధిని తొలగించు స్వామీ అని హనుమాన్ చాలీసా పారాయణం చేశామని తెలియజేశారు. కర్నూలు నగర అధ్యక్షులు టీ.సీ. మద్దిలేటి మాట్లాడుతూ ఉగ్రవాద మూలాలు కలిగిన ఫీ.ఎఫ్.ఐ.సంస్థ తో కలిపి బజరంగ్ దళ్ ను నిషేధిస్తామన్న కాంగ్రెస్ తన గొయ్యి తానే తవ్వుకున్నదనీ, బజరంగ్ దళ్ అంటే దేశభక్తి, హైందవ సనాతన ధర్మ పరిరక్షణ కొరకు మాత్రమే కాక దేశవ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నదనీ... ఉచిత రక్తదానం,స్మశానాలను శుభ్రపరచడం,యువతను వ్యసనాలకు దూరంగా ఉంచడం,పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం వంటి ఎన్నోకార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలియజేశారు.బజరంగ్ దళ్ విభాగ్ కన్వీనర్ నీలి నరసింహ మాట్లాడుతూ ...దేశంలో ప్రతి హిందూ యువకుడు బజరంగ్ దళ్ కార్యకర్తయే అని వారు తలుచుకుంటే ఇప్పటికే "అంపశయ్య" పై ఉన్న కాంగ్రెస్ పార్టీని "బంగాళాఖాతం" లో కలపడం ఖాయమని అందుకు బజరంగ్ దళ్ సిద్ధంగా ఉన్నదని,అందు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉండిలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాష్, జిల్లా సహకార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి శ్రీనివాస రెడ్డి, జిల్లా ప్రసార - ప్రచార కన్వీనర్ రామకృష్ణ , మల్లికార్జున , నగర ఉపాధ్యక్షులు కృష్ణపరమాత్మ,కార్యదర్శి ఈపూరి నాగరాజు,బజరంగ్ దళ్ నగర కన్వీనర్ భగీరథ,కో కన్వీనర్ నాగరాజు, అరుణ్ కుమార్, ప్రఖండ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కార్యదర్శి గూడూరు గిరిబాబు, చిన్న రంగు స్వామి,బజరంగ్ దళ్ కన్వీనర్ భాస్కర్,సల్కాపురం బాబూరావు,సాయి,తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్స్ పోస్టుల నియామకాలలో అక్రమాలకు పాల్పడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి( డి ఎం హెచ్ ఓ )నీ సస్పెండ్ చేయాలి

**బి గిడ్డయ్య సిపిఐ జిల్లా కార్యదర్శి**

కర్నూలు, మే 6విభారె న్యూస్ : కర్నూలు...జిల్లావ్యాప్తంగా ఆశా కార్యకర్తల నూతన పోస్టుల భర్తీ విషయంలో అధికార పార్టీ నాయకులకు తొత్తుగా మారి అవినీతికి పాల్పడుతూ అర్హులైన మహిళలకు అన్యాయం చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రామగిడ్డయ్య ని వెంటనే సస్పెండ్ చేసి అర్హులైన వారికి ఆశ కార్యకర్తల ఉద్యోగం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాలహర్వి మండలం ,గూళ్యం గ్రామ 1వసచివాలయానికి సంబంధించి ఆశా కార్యకర్త పోస్ట్ కు నోటిఫికేషన్ విడుదల చేస్తే విగీతమ్మ చి/రా మహాలింగప్ప అనే మహిళ అప్లై చేసుకున్నది. ప్రభుత్వ సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపిక కావడం జరిగింది.జాబితాలో ఆమె పేరు రావడంతో మార్చి నెల 20వ తేదీన ఆమెను ఉద్యోగంలో జాయిన్ కావాలని ఆదేశించడంతో మార్చి 20వ తేదీ అలహర్వి పి.హెచ్.సి మెడికల్ ఆఫీసర్ దగ్గర ఉద్యోగంలో చేరి గూల్యం గ్రామ 1వసచివాలయం లో విధులు నిర్వహిస్తున్నది. ఆమె విధులు నిర్వహిస్తుండగా కొంతమంది అధికార పార్టీ వారు అడ్డు చెబుతున్నారంటూ, చెబుతూ ఆమెను ఏప్రిల్ ఒకటో తేదీ నుండి విధులకు రావద్దంటూ స్థానిక వైద్యాధికారి మన్సూర్ భాషా ద్వారా మౌఖికంగా చెప్పించి ఆమెని విధులను నిర్వర్తించకుండా ఆపడమే కాకుండా ఆమె స్థానంలో మల్లమ్మ వైఫ్ ఆఫ్ గాద లింగన్న ను ఆశవర్కర్ గా నియమించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ అర్హులకు ఆన్యాయం చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రామగిడ్డయ్య పై జిల్లా కలెక్టర్ విచారణ జరిపి శాఖా పరమైన చర్యలు తీసుకోని సస్పెండ్ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. ఇలాంటి అధికారుల కారణంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అనేక అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని, ఈయన పూర్తిగా అవినీతిలో కూడుకుపోయాడని,కరోనా సమయంలో కోట్ల రూపాయలు దుర్వినియోగం జరిగాయని,ఇలాంటి అధికారుల కారణంగా వైద్య ఆరోగ్య శాఖకు చెడ్డ పేరు వస్తుందని తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించాలని విచారణ జరిపి గూళ్యం గ్రామంలో ఆశ వర్కర్ గా మొదట ఉద్యోగం పొందిన గీతమ్మ అనే మహిళకు న్యాయం చేయాలని ఆయన కోరారు. గీతమ్మ అనే మహిలని ఉద్యోగంలో కొనసాగించాలని, అక్రమాలకు పాల్పడిన డిఎంహెచ్ఓ రామగిడ్డయ్యను వెంటనే సస్పెండ్ చేసి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని, ఆశ కార్యకర్తగా నియమించి నెలలోపులే లంచాలు తీసుకొని వేరొకరికి ఆ పోస్టును అమ్ముకున్న డి ఎం హెచ్ ఓ రామగిడ్డయ్య పై ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి గారికి రాష్ట్రమానవ హక్కుల కమిషన్ కు హైకోర్టుకు పిర్యాదు చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు



# ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కర్నూలు, మే 6విభారె న్యూస్ : యువగలం పాదయాత్ర ద్వారా కర్నూలుకు వచ్చిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గారిని కలిసి ఆటో కార్మికులపై పోలీస్ దాడులు అధిక చలానాలు ఫీజుల పెంపు అక్రమ వసుళ్ళ ఆపాలని ఆర్టిఏ అధిక చలానా ఫీజులు పెంచుతూ జారీ చేసిన జీవో 21 రద్దు చేయాలని× సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయని ఆటో స్టాండ్ ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని పెట్రోల్ డీజిల్ పై రాష్ట్ర పన్నును ఎత్తివేయాలని మరియు రోడ్ సైడ్ చిన్న వ్యాపారస్తులపై పోలీసులు పర్యాయాలు ఇటీ కేసులు పేరుతో ఫైన్లు అధికంగా వేస్తూ కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని చిన్న వ్యాపారులకు శాశ్వత స్థలాలు కేటాయించాలని పై సమస్యలు పరిష్కరించాలని లోకేష్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది వినతి పత్రం ఇచ్చిన వారిలో సిఐటియు న్యూ సిటీ నగర కార్యదర్శి సిహెచ్ సాయిబాబా చిన్న వ్యాపారస్తుల సంఘం నగర కార్యదర్శి ఎస్ మహమ్మద్ రఫీ ఆటో యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్ హుస్సేన్ వలి. మహిళ నాయకురాలు రమీ జాబిఆటో యూనియన్ ఉపాధ్యక్షుడు పి నబి సాహెబ్ .ఐటీసీ శ్రీను .సుందరయ్య సర్కిల్ ఆటో స్టాండ్ నుంచి .కర్ణ గారు. పాల్గొన్నారు చిన్న వ్యాపారస్తుల సంఘం నాయకులు గౌస్ తదితరులు ఉన్నారు ఎస్ హుస్సేన్ వలి ఆటో యూనియన్ నాయకులు

## భూములు కోల్పోయిన వారికి సత్వరమే భూ పంపిణి చేపట్టాలి

బద్వేలు పరిశ్రమ ఏర్పాటు తొ భూములు కోల్పోయిన తమకు సత్వరమే భూ పంపిణి కార్యక్రమం చేపట్టాలని గోపవరం ప్రాజెక్ట్ కాలనీ వాసులు డిమాండ్ చేశారు.ఈ మేరకు స్థానిక కాలనీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఇండో జర్మని గోపవరం కో ఆపరేటివ్ జాయింట్ పార్మింగ్ సొసైటీ ఆధ్వర్యంలో1972లొ200మంది ఎస్సి ఎస్టీ లకు 5 ఎకరాల చొప్పున వంద సంవత్సరాల లీజు పద్ధతిన భూములను పంపిణి చేశారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తమ భూములను పరిశ్రమ నిర్మాణానికై ప్లేవుడ్ పరిశ్రమకు అప్పగించిందన్నారు. ఈ క్రమంలోసొసైటీ సభ్యులైన200మందితోపాటు నాన్ సభ్యులు మరో 65 మందికి 2.5ఎకరాల భూమిని పంపిణి చేసేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు తమకు ఒప్పంద పత్రం అందచేశారన్నారు. ఇందులో భాగంగా265 మంది సభ్యులకు గాను ఇంకా 85 మందికి పైగా భూములు కోల్పోయిన సభ్యులకు ఇంతవరకు భూ పంపిణి చేయక పోవడం బాధాకరమన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190